MAHILA SADHIKARATHA

# మహిళా సాధికారత

స్వయంసహాయ ఉద్యమ సమాచార తెలుగు మాస పత్రిక

mas

సంపుటి :19 సంచిక: 4 రంగారెడ్డి డిసెంబర్ 2020 పేజీలు : 36 వెల : రూ. 10/-

## కరోనా యోధులకు ' అనంత ' సత్కారం!





కరోనా కల్లోలంలో అసహాయులను ఆదుకున్న ఆపద్బాంధవులను 'యోధులకు వందనం' అంటూ అనంతపురం జిల్లా కలెక్టర్ ఘనంగా సత్కరించారు. గుడిబండ మండలంలో విశిష్ట సేవలు అందించిన ఏపిమాస్ సిబ్బంది శ్రీ లోకేష్, శ్రీ రాజశేఖర్, శ్రీ గోపాలరాజులను ఎంపిడిఓ సన్మానించిన దృశ్యాలు



తెలంగాణాలోని భద్రాద్రి జిల్లాలో స్వయంసహాయ సంఘాల సభ్యులకు సంఘ నిర్వహణపై నాబార్డ్ తోడ్పాటుతో ఏపిమాస్ శిక్షణ

## ఏపిమాస్ శిల్పులు, శిల్పాలు!



శ్రీ ఆర్ భాస్కర రావు
ప్రాజెక్ట్ ఆఫీసర్



శ్రీమతి ఎన్ రెడ్డెమ్మ
ఎఫ్ పి ఓ అధ్యక్షురాలు

## సి ఎస్ రెడ్డిచే ప్రారంభోత్సవాలు !




కర్నూలులో ఏపిమాస్ కార్యాలయం



అనంతపురం జిల్లా పెద్దవడుగూరు మండలం చిత్రచేడులో వెరుశనగ సేకరణ కేంద్రం

NABARD
నాబార్డ్ సౌజన్యంతో


नाबार्ड
అభివృద్ధి
కోసం
పారిశుద్ధ్యం
నాబార్డు సౌజన్యంతో
చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి
స్వచ్ఛత ఉద్యమం
మరుగుదొడ్డి ఉపయోగించడం వల్ల మీకు కలిగే ప్రయోజనాలు:
• మీ ఇంటిలో పరిశుభ్రత ఉంటుంది • వివిధ జబ్బులకు దూరంగా ఉంటారు
• ఆరోగ్యకరమైన మరియు పరిశుభ్రమైన వాతావరణం ఏర్పడుతుంది
• పరిశుభ్రంగా ఉంటారు మరియు కరోనాను దూరంగా పారదోలతారు
गाँव बढ़े >> तो देश बढ़े
www.nabard.org
YouTube /nabardonline
Taking Rural India >>Forward

# మహిళా సాధికారత

సంపుటి 19 సంచిక 4



సంపాదకీయం

## నైపుణ్యాలు !

**ఉ**పాయంలేని వాణ్ణి ఊళ్ళోంచి వెళ్ళగొట్టమని ఒక సామెత ! మందబుద్ధివల్ల వాడికీ చేటే, ఊరికీ సమస్యే. అందుకే ఆ మాట వచ్చింది. ఇదే విధంగా కాలానుగుణంగా మార్పు చెందని, చెందడానికి ఇష్టపడనివారివల్ల కూడా ఇబ్బందే. ఉదాహరణకు నేటి సమాచార విప్లవ యుగంలో సెల్‌ఫోన్ ఉపయోగించడం తెలీకపోతే ఎన్నో సమస్యలు. కాని ఆ విషయంలో తెలుగు రాష్ట్రాలు ముందంజలోనే వున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. స్వయంసహాయ ఉద్యమాన్ని సద్వినియోగంచేసుకోవడంలో కూడా మన ఉభయ రాష్ట్రాలు దేశానికే దిశానిర్దేశం చేశాయికదా! వీలైనంతగా అన్నిరంగాలలో ఇలా ముందంజవేసినపుడే నేటి ఈ పోటీ ప్రపంచంలో నిలవగలుగుతాం, నిలదొక్కుకోగలుగుతాం. అందుకే ప్రభుత్వాలు కూడా విద్యార్థులకు, యువతకు, మహిళలకు ఎన్నో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాయి. ఏపిమాస్‌తో సహా అనేక సంస్థలు కూడా వివిధ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను అమలు జరుపుతున్నాయి. అందివచ్చిన అవకాశాలను అందిపుచ్చుకుని ఎదిగినప్పుడే సార్థకత. వీటితోపాటు స్వయంసహాయ రంగంలో, వ్యవసాయ రంగంలో శక్తిసామర్థ్యాలను, నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఏపిమాస్ ఎన్నో శిక్షణలు యిస్తున్న విషయం తెలిసిందే కదా! రెండు దశాబ్దాలకు పైగా ఉద్యమస్థాయిలో సాగుతున్నందువల్ల స్వయంసహాయ రంగం ఒక దశకు చేరుకున్నది. సవ్యమైన మార్గంలో వినియోగిస్తే సంఘటిత శక్తి ఎంతటి సత్ఫలితాలను సాధించగలుగుతుందో స్వయంసహాయ ఉద్యమం ప్రపంచానికి చాటిచెప్పింది. అందువల్లనే అదే సంఘటిత శక్తి ప్రయోగాన్ని మరెన్నో రంగాలకు అన్వయించి గణనీయమైన ఫలితాల సాధనకు ప్రపంచం సమాయత్తమవుతున్నది. ముఖ్యంగా వ్యవసాయరంగంలో రైతుసంఘాలతో ప్రారంభించి, రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్ పి ఓల) వరకు చేరుకోవడం వర్తమాన చరిత్ర. సదవగాహనతో, సమర్థంగా నిర్వహించగలిగితే ఎఫ్ పి ఓ లు వ్యవసాయ రంగ ముఖచిత్రాన్నే మార్చివేయగలుగుతాయి. అన్నదాతగా ప్రజలకు ఆహారం సమకూర్చడంతోపాటు, రైతు ఆర్థికంగా తానూ సమున్నత స్థాయికి చేరుకోగలుగుతాడు. సమాజంలో గౌరవ స్థానాన్ని తిరిగి చేజిక్కించుకోగలుగుతాడు. అయితే, ఇదంత సులువేంకాదు. అదేవిధంగా అసాధ్యమూ కాదు. కావలసింది ప్రగతి మార్గంలో ముందడుగు వేయడానికి సంసిద్ధత, దృఢ సంకల్పం, ఆ సంకల్పాన్ని నెరవేర్చుకోవడానికి ఎవరికివారు తమను తాము సన్నద్ధం చేసుకోవడం. మొత్తం ప్రపంచమే ఒక కుగ్రామంగా మారిన, దశదిశల సమాచారాన్ని క్షణాల్లో కళ్ళకు కట్టించే అత్యధునాతన సమాచార, సాంకేతిక సాధనాలు అందుబాటులోకి వచ్చిన నేటి కాలంలో ఆసక్తి వుండాలేకాని, ఎక్కడ ఏం జరుగుతున్నదో, ఏ కొత్తదనం ఉరకలు వేస్తున్నదో తెలుసుకోవడం ఎంతసేపు! ఏ రంగంలోని వారైనా అభివృద్ధిచెందడానికి ఆకాశమే హద్దు. ఈ అవకాశాలను అందుకుని ఎఫ్ పి ఓలు ముందడుగు వేయగలిగితే అనంతమైన అభివృద్ధిని సాధించవచ్చు. ముందుగా వాటి నిర్వాహకుల ఆలోచనా ధోరణిలో సమయానుగుణమైన సానుకూల మార్పు రావాలి. సాగు పద్ధతులలో వస్తున్న విప్లవాత్మకమైన మార్పులను, ఖర్చులు తగ్గించుకుని, అధిక దిగుబడులు సాధించడంతోపాటు, ఆదాయాన్ని గణనీయంగా పెంచుకునే మార్గాలను అన్వేషించాలి. తమ ప్రాంతానికి ఏ సీజన్‌లో ఏ పంట అనువైనదో తెలుసుకోవడంతోపాటు, ఇతరత్రా ఎక్కడ ఎప్పుడు ఏ పంట ఎంత విస్తీర్ణంలో సాగవుతున్నదో, ఆ ఉత్పత్తులు ఏఏ మార్కెట్లలోకి ఎప్పుడు వస్తాయో తెలుసుకుని, తమ సాగుబడిలో తదనుగుణమైన మార్పుచేర్పులు చేసుకోగలిగే ముందుచూపు అవసరం. లేకుంటే నాణ్యమైన పంట పండించినా అన్నిచోట్లనుండి ఒకేసారి పంట మార్కెట్లో వెల్లువెత్తి కొనేవారులేక విలవిలలాడవలసి వస్తుంది. అదే విధంగా ఇతర ప్రాంతాలలో, దేశాలలో మంచి గిరాకీ వుండే ఏవైనా అరుదైన పంటలను పండించే ప్రయోగాలు మన ప్రాంతంలో చేయవచ్చునేమో ఆలోచించి, కొద్దిపాటి ఇబ్బందులకు సిద్ధమై ప్రయత్నించవచ్చు. నాణ్యమైన ఉత్పత్తులను పండించడంతోపాటు మార్కెటింగ్ నైపుణ్యాలను పెంచుకోవడం తప్పనిసరి. పంటలకు, వ్యవసాయానికి అనువైనకాలం, అనువుకాని తరుణం అంటూ వుండవచ్చునేమో కాని, రైతులను అభివృద్ధి పథంలో అగ్రగాములను చేసే బాధ్యతను తలకెత్తుకున్న ఎఫ్ పి ఓ లు నిరంతరం కొత్తదనాన్ని, పురోగమన మార్గాలను అన్వేషిస్తుండవలసిందే. ఆ దిశగానే తన నిర్వహణలోని ఎఫ్ పి ఓలకు ఏపిమాస్ మార్గదర్శనం చేస్తున్నది. అందుకోగలిగితే అన్నీ అవకాశాలే !

Edited, Printed, Published and owned by **T.Chandra Sekhar Reddy;** Printed at Kala Jyothi Process Pvt.Limited, S No:185, Kondapur, Hyderabad-500133, Ranga Reddi District, Telangana;Published at Mahila Abhivruddhi Society, Andhra Pradesh (APMAS), Plot No.11&12,HUDAColony, Tanesha Nagar, Near DreamVally,Manikonda,Rangareddi District,Hyderabad-500089. **Editor:**T.**Chandra Sekhar Reddy**

ఒకే పరిస్థితి మనోబలం క్షీణిస్తే సమస్యగా, స్థిరంగా వుంటే సవాలుగా, దృఢంగా వుంటే అవకాశంగా మారుతుంది

# మహిళా సాధికారత

ఎడిటర్ : **టి.చంద్రశేఖర రెడ్డి** అసోసియేట్ ఎడిటర్ : **జె.వి. క్రిష్ణమూర్తి**

ఎడిటోరియల్ కమిటి : ఏ. కళామణి, ఎస్. రామలక్ష్మి, ఎన్.వినాయకరెడ్డి, బి.వెంకటేశ్వర్లు

కంపోజింగ్, డిజైనింగ్ : ఎన్. రమాదేవి కన్సల్టెంట్ : కె.రఘురామరాజు


## లోపలి పేజీలలో ....


- కరోనా యోధులకు 'అనంత' సన్మానం ! ...05
- స్వచ్ఛంద సేవలకు ఆటంకాలా ? ...06
- తెలంగాణాలో నాబార్డ్ కార్యక్రమాలు ...10
- పెరటి తోటల పెంపకంలో మెలకువలు ...12
- సన్న జీవాల నష్టపరిహార పథకం ...13
- పేద మహిళలను ఆదుకునే పెన్నిధి 'స్త్రీనిధి' ! ...15
- గ్రామాల రూపురేఖలు మార్చిన భాస్కర్ ! ...18
- మహిళా నాయకత్వానికి వన్నెతెచ్చిన రెడ్డెమ్మ ! ...19
- శానిటైజర్లు అతిగా వాడితే దుష్పరిణామాలు! ...21
- అందరి కోసం ... అందరి ఇల్లు ! ...25
- పత్తి కట్టె కాల్చకండి ...లాభం పొందండి! ...28
- శీతాకాలంలో పశువులకు నిల్వ నీరివ్వవద్దు ...29
- పశువులకు వచ్చే వ్యాధులు, వాటికి చికిత్సలు ...30
- త్వరగా ఉన్నత స్థాయికి చేర్చే ఉపాధి మార్గాలు! ...31
- పేద విద్యార్థులకు అండగా సరోజినీ ఫౌండేషన్ ...32
- కాగితపు విత్తనం ... మొలకెత్తే విచిత్రం ! ...34



**గమనిక :** 'మహిళా సాధికారత' అనంతమైన భిన్నత్వం నుంచి ఆశావహమైన ఏకత్వానికి వేదిక. ఈ పత్రికలో ప్రచురించే రచనలలో వ్యక్తమయ్యే అభిప్రాయాలు పత్రికా నిర్వాహకుల అభిప్రాయాలు కాకపోవచ్చు.


### 'మహిళాభివృద్ధి సొసైటీ' (మాస్)

'మహిళా సాధికారత' పత్రిక మాతృసంస్థ మహిళాభివృద్ధి సొసైటీ. దీనిని ఏపిమాస్ అని, మాస్ అని కూడా సంక్షిప్తంగా పిలుస్తారు. 2001జూన్ 14 వ తేదీన పబ్లిక్ సొసైటీగా మహిళాభివృద్ధి సొసైటీ హైదరాబాద్ ప్రధాన కార్యాలయంగా ఏర్పాటైంది. తెలుగు రాష్ట్రాలలో, మన దేశం లోని ఇతర అనేక రాష్ట్రాలలో స్వయంసహాయ సంస్థల సుస్థిరాభివృద్ధికి విశేష సేవలను అందించిన ఈ సంస్థ ప్రస్తుతం రైతుల అభ్యున్నతికి, పర్యావరణ పరిరక్షణకు, ఆదర్శ గ్రామాల నిర్మాణానికి, స్వయంసహాయ సంస్థల స్వయం నియంత్రణకు గణనీయమైన కృషి చేస్తున్నది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ చేసిన శ్రీ కె. మాధవరావు ఛైర్మన్‌గా వివిధ రంగాలలో విశేషానుభవం గడించిన ప్రముఖులు ఈ సంస్థ పాలకవర్గంలో వున్నారు. సంస్థ వ్యవస్థాపక సి ఇ ఓ శ్రీ సి ఎస్ రెడ్డి ఎండి గా, సిఇఓ గా వున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, బీహార్‌లలో కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఈ సంస్థకు ప్రధాన కార్యాలయంతోపాటు, ఒక ప్రాంతీయ కార్యాలయం, 21 క్షేత్ర కార్యాలయాలు వున్నాయి. దాదాపు 250 మందికి పైగా సిబ్బంది వున్నారు. ప్రజలకు అవగాహన కలిగించడం కోసం మహిళా సాధికారత పత్రికతోపాటు వివిధ వైజ్ఞానిక పుస్తకాలను, ఈ సంస్థ ప్రచురిస్తుంటుంది.


| ప్రోత్సాహక చందా | | |
|---|---|---|
| ఏడాదికి | : | రూ. 110 |
| రెండేళ్ళకు | : | రూ. 200 |
| మూడేళ్ళకు | : | రూ. 280 |

| ప్రకటన ఛార్జీలు | |
|---|---|
| మల్టీకలర్ ఫస్ట్ పేజి (సగం)/బ్యాక్ పేజి(పూర్తి) | : రూ. 25,000 |
| మల్టీకలర్ ఇన్‌సైడ్ కవర్ పేజి (పూర్తి) | : రూ. 15,000 |
| బ్లాక్ అండ్ వైట్ లోపలి పేజి (పూర్తి) | : రూ. 10,000 |

**చందాలు లేదా ప్రకటనలకోసం పంపే డిడిలను 'ఏపిమాస్ -హైదరాబాద్' పేరుమీద పంపాలి**



మహిళా సాధికారత, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్, డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089. ఫోన్స్ : 08413-403118/ 19/20, ఫాక్స్ : 08413-403117 Web: www.apmas.org, E Mail: info@apmas.org


నేరుగా విజయం రాదు, వచ్చేవి అవకాశాలు, సాధ్యాసాధ్యాలు మాత్రమే ; వాటినే మనం విజయాలుగా మలచుకోవాలి

# కరోనా యోధులకు ‘అనంత’ సన్మానం !

**- గోపాల రాజు**

ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా (కోవిడ్-19) మహమ్మారిని సైతం లెక్క చేయకుండా కోవిడ్ బారిన పడిన మానవాళిని కాపాడడానికి విశ్వ ప్రయత్నం చేస్తున్న వైద్యులు కనిపించే దేవుళ్ళతో సమానం. దానిని విస్తరించకుండా కట్టడి చేయడానికి ప్రభుత్వ, ప్రభుత్వేతర కృషి ఎంతగానో సాగుతున్నది. ఈ బృహత్ సేవా కార్యక్రమంలో పాల్గొంటున్న వైద్య సిబ్బంది, నర్సులు, పోలీసులు, పారిశుధ్య కార్మికులు స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు ఎందరెందరో తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి కరోనా కల్లోలంలో వివిధ రకాలుగా సతమతమవుతున్న ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలను అందించడానికి అలుపెరుగని సేవలు చేశారు, చేస్తున్నారు.



ముఖ్యంగా తమ ప్రాంతాలలో తగిన బతుకుదెరువు పొందలేక పొట్టకూటికోసం దూర ప్రాంతాలకు వలస వచ్చి కరోనా దిగ్బంధంలో తమ స్వంత గ్రామాలకు వెళ్లలేక చిక్కుకుపోయినవారికి, గ్రామాలలో ఎలాంటి పని దొరకక, ఆదాయం లేక పస్తులతో వెళ్ళదీయవలసి వచ్చిన పేద కుటుంబాల వారికి కొన్ని స్వచ్ఛంద సంస్థలు దాతృత్వ సంస్థల సహకారంతో కొన్నిరోజులకు సరిపడా ఆహార పదార్థాలు, కూరగాయలు, పండ్లు, నూనె, కరోనా నివారణకు ఉపకరించే మాస్కులు, శానిటైజర్లవంటివి అందజేసి ఆదుకున్నారు. కోవిడ్-19 ముప్పును గురించి వివిధ రూపాలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. వీరందరూ ఎంతైనా అభినందనీయులే.

కరోనా మహమ్మారి కష్టకాలంలో ఏపీమాస్ సంస్థ ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో తమ ప్రాజెక్టుల పరిధిలోని వివిధ ప్రాంతాలలో రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధరతో విక్రయించడానికి వీలు కల్పిస్తూ, వివిధ మార్కెటింగ్ ఏజెన్సీలు, ప్రాసెసింగ్ పరిశ్రమలతో అనుసంధానించడం, గ్రామాలలో అవగాహన, సహాయ కార్యక్రమాలు నిర్వహించడం,మానవతా దృక్పథంతో ఆహార పదార్థాలు, పండ్లు, కూరగాయలను అందజేయడం, మాస్కులు, శానిటైజర్ల వంటి ఆరోగ్య సంరక్షణ పరికరాలను, పశువుల కోసం, చిన్నజీవాల కోసం దాణా పంపిణీ వంటి కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించి పలువురి మన్ననలను పొందింది. ఈ సహాయ కార్యక్రమాలలో భాగంగా

### ఉభయ తెలుగు రాష్ట్రాలలో ఏపిమాస్ కోటిన్నర సాయం !

కరోనా కల్లోలంలో ఏపిమాస్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలలో వివిధ రకాలుగా సేవలు అందించింది. దాతృత్వ సంస్థలకు ప్రేరణ కలిగించి వారి ఆర్థిక సహాయంతో 13 వేల మంది పేదలకు, నిస్సహాయులకు, 4.6 వేల మంది రైతులకు కోటిన్నర రూపాయల పైగా ఆహార పదార్థాల రూపేణా, కరోనా నివారక వైద్య సామగ్రి రూపేణా, రైతులకు పంటల కొనుగోలు, ప్రాసెసింగ్ పరిశ్రమలతో అనుసంధానం రూపేణా , అవగాహన కార్యక్రమాల రూపేణా గణనీయమైన సహాయం అందించింది.



జీవితంలో వచ్చే ఆటుపోట్లను మనం అభినందించాలి, అవే మనకు మరింత శక్తిని, వివేకాన్ని, వినయాన్ని అందిస్తాయి

# స్వచ్ఛంద సేవలకు ఆటంకాలా ?

–భారతి కోడె

**మా**ర్చి నెలలో దేశంలో లాక్ డౌన్ విధించగానే దాదాపు అందరూ అసౌకర్యానికి గురయ్యారు. అయితే అందరికన్నా ఎక్కువగా దినసరి వేతనాలకు పని చేసే కూలీలు, వలస కార్మికులు, చిన్నా చితకా వ్యాపారాలు చేసుకునే వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎంతోమంది తినడానికి గుప్పెడు మెతుకులు కూడా దొరకని పరిస్థితులలో ఉన్నప్పుడు వారిని ఆదుకునేందుకు ప్రధానంగా ముందుకు వచ్చింది దేశంలోని స్వచ్ఛంద సంస్థలే. ఈ సందర్భమే కాదు దేశంలో ఏ ప్రాంతంలో ఏ విపత్తువచ్చినా వెంటనే వారికి అవసరమైన తక్షణ సహాయం, పునరావాసం కల్పించడంలో స్వచ్ఛంద సంస్థలు పోషిస్తున్న పాత్ర వెలకట్టలేనిది. ఈ స్వచ్ఛంద సంస్థలకు అందే విదేశీ నిధులకు సంబంధించిన ఫారెన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేటరీ యాక్ట్ (ఎఫ్ సి ఆర్ ఎ) కు గత నెల చివరిలో ప్రభుత్వం చేసిన కొన్ని సవరణలు దేశంలో స్వచ్ఛందసంస్థల భవిష్యత్తుపై చర్చలకు తెరతీశాయి.

పేదరిక నిర్మూలన, విద్య, వైద్యం, ఉపాధి, మహిళా సాధికారత వంటి ఎన్నో అంశాలపై దేశంలోని స్వచ్ఛంద సంస్థలు పని చేస్తున్నాయి. అధికారిక లెక్కల ప్రకారం దేశంలో 32 లక్షలకు పైగా స్వచ్ఛంద సంస్థలు రిజిస్టర్ చేయబడి ఉన్నాయి. అందులో ప్రస్తుతం పని చేస్తున్న సంస్థలు ఎన్ని అనే దానిపై గణాంకాలు ఖచ్చితంగా లేనప్పటికీ వాటి సంఖ్య లక్షలలో ఉన్నట్లు మాత్రం తెలుస్తుంది.

ఈ సంస్థలన్నీ నిధులు సమకూర్చుకునేందుకు ప్రధానంగా ఆధారపడేది విదేశీ దాతృత్వ సంస్థల మీదే. 2013లో వచ్చిన కంపెనీల చట్టం దేశంలో కార్పొరేట్ సంస్థలకు సామాజిక బాధ్యతా కార్యక్రమాలను తప్పనిసరి చేయడంతో అనేక కార్పొరేట్ సంస్థలు తమ లాభాలలో కనీసం రెండు శాతం నిధులను సామాజిక సేవా కార్యక్రమాలకు ఖర్చు చేస్తున్నాయి. వీటిలో చాలా సంస్థలు తమ కార్యక్రమాలను అప్పటికే ప్రజలతో మమేకమై పని చేస్తున్న స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో చేస్తుండగా కొన్ని సంస్థలు మాత్రం నేరుగా తమ స్వంత ట్రస్టులు, ఫౌండేషన్‌ల ద్వారా ఈ కార్యక్రమాలను అమలు చేస్తున్నాయి. స్వచ్ఛంద సంస్థలు తమ కార్యక్రమాలను అమలు చేసేందుకు ఈ కార్పొరేట్ సంస్థల నిధులు కూడా కొంత తోడ్పడుతున్నాయి.

విదేశీ సంస్థల నుండి స్వచ్ఛంద సంస్థలు తీసుకునే విరాళాలన్నీ 1976లో చేసిన ఫారెన్ కాంట్రిబ్యూషన్ రెగ్యులేటరీ యాక్ట్ (ఎఫ్ సి ఆర్ ఎ) కింద నియంత్రించబడతాయి. అయితే 2010లో ఇలా వచ్చిన విదేశీ నిధులు ప్రజోపయోగ కార్యక్రమాలకు కాక కొంత రాజకీయ కార్యకలాపాలకు వినియోగింపబడుతున్నాయనీ, దేశ రాజకీయాలలో విదేశీ జోక్యం పెరిగే అవకాశం ఉందనీ గ్రహించి అప్పటి ప్రభుత్వం ఈ చట్టంలో భారీ సవరణలు చేసింది. దేశ రాజకీయాలతో అనుబంధం ఉన్న ఏ సంస్థలూ విదేశీ నిధులు పొందే అవకాశం లేకుండా ఈ సవరణలు జరిగాయి.

---

ఏపిమాస్ అనంతపురంజిల్లా నల్లమాడ, గుడిబండ మండలాలలో తాను నిర్వహిస్తున్న జి4 ప్రాజెక్ట్, క్లైమేట్ స్మార్ట్ విలేజ్ ప్రాజెక్టుల ద్వారా 12 గ్రామ పంచాయతీలలో అవగాహన, కార్యక్రమాలు, 1700 కుటుంబాల వారికి మాస్క్‌ల పంపిణీ, 520 పేద కుటుంబాల వారికి రేషన్ పంపిణీ, 750మంది పాడి రైతులకు వారి పశువులు, చిన్న జీవాల కోసం దాణా పంపిణీ చేసింది. ఈ అవగాహన, సహాయ కార్యక్రమాలకు గుర్తింపుగా 2020 నవంబరు 13వ తేదీన గుడిబండ మండల పరిషత్ అభివృద్ధి అధికారి సన్మాన సభ ఏర్పాటు చేసి, కరోనా కల్లోలంలో ఏపిమాస్ అందించిన సహాయాన్ని, చేసిన సేవలను కొనియాడి ఏపిమాస్ ప్రాజెక్టు మేనేజర్ శ్రీ గోపాలరాజుకు, ఏపిమాస్ నల్లమాడ మండల వ్యవసాయ అధికారి శ్రీ రాజశేఖర్‌రెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ శ్రీ లోకేష్‌కు శాలువా కప్పి, సన్మానం చేసి, సన్మాన పత్రం అందచేశారు. ■

**జీవితమంటే గొప్ప పాండిత్యమో, ఆభరణాలో, ఆడంబరంగా బతకడమో కాదు; ఇతరులకు నీవు పంచే ఆనందం మాత్రమే**

ఈ చట్టం ప్రకారం దేశంలోని ఏ స్వచ్ఛంద సంస్థ అయినా విదేశీ నిధులను పొందాలంటే హోమ్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ వద్ద రిజిస్ట్రేషన్ తప్పని సరి. ఈ మంత్రిత్వ శాఖ ప్రతి సంస్థకు ఒక ప్రత్యేక రిజిస్ట్రేషన్ నెంబర్‌ను కేటాయిస్తుంది. ఇది ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుంది. దేశంలో ఇరవై వేలకు పైగా స్వచ్ఛంద సంస్థలు ఈ ఎఫ్.సి.ఆర్.ఏ. చట్టం కింద రిజిస్టర్ చేయించుకుని విదేశీ నిధులు పొందేందుకు అనుమతులు పొంది ఉన్నాయి. ఈ స్వచ్ఛంద సంస్థలు అన్నీ ప్రతి మూడు నెలలకి ఒకసారి తాము పొందిన విదేశీ నిధుల వివరాలను ఫైలింగ్ చేయడంతో పాటు తమ పేరు, చిరునామా, బ్యాంకు అకౌంట్, ముఖ్యమైన సభ్యుల వివరాలలో ఏమైనా మార్పులు ఉన్నట్లయితే పదిహేను రోజుల ముందే సంబంధిత శాఖకు తెలియచేయవల్సి ఉంటుంది.

దేశంలో లక్షలాది స్వచ్ఛంద సంస్థలు అత్యంత మారుమూల ప్రాంతాలలో, ప్రభుత్వాలు కూడా విస్మరించిన ఎన్నో రంగాలలో సేవలందిస్తూ అత్యంత నిస్సహాయ, నిరుపేద వర్గాలకు చేరువయ్యాయి అన్నది వాస్తవం. ఎక్కడ ఏ విపత్తు సంభవించినా ముందుగా సేవకి సిద్ధమయ్యేది ఈ సంస్థలే. మారుమూల గిరిజన ప్రాంతాలలో విద్య, వైద్య సేవలు అందివ్వడంలో, హెచ్.ఐ.వి వంటి వ్యాధుల నియంత్రణలో, దళితులు, ఆదివాసీల హక్కుల పరిరక్షణలో, పర్యావరణ సంరక్షణలో ఇంకా ఎన్నో కీలకమైన అంశాలలో దేశం సాధించిన పురోగతిలో ఈ సంస్థలు కీలక పాత్ర పోషించాయన్నది వాస్తవం.

అయితే నాణానికి మరొకవైపు అనేక సంస్థలలో జవాబుదారీతనం, పారదర్శకత లోపించాయనేది కూడా అంతే వాస్తవం. రిజిస్టర్ కాబడిన 32 లక్షలకు పైగా స్వచ్ఛంద సంస్థలలో కనీసం పది శాతం కూడా ఆడిట్ చేయబడిన అకౌంట్స్‌ను ప్రభుత్వానికి సమర్పించడం లేదని ప్రభుత్వ శాఖలు విమర్శ చేస్తున్నాయి. 2014 లో విడుదలైన ఇంటలిజెన్స్ బ్యూరో నివేదిక దేశంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు అమలు చేస్తున్న గ్రీన్ పీస్, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, యాక్షన్ ఎయిడ్ వంటి ప్రముఖ సేవా సంస్థలపై తీవ్ర విమర్శలు చేసింది. ఈ సంస్థలు దేశంలో కొన్ని అభివృద్ధి వ్యతిరేక కార్య కలాపాలకు నిధులు అందించాయనీ, దాని వలన దేశ స్థూల జాతీయోత్పత్తికి రెండు నుండి మూడు శాతం నష్టం జరిగిందనీ ఈ నివేదిక వెల్లడించింది. అప్పటి నుండి స్వచ్ఛంద సంస్థల వ్యవహారాలపై ప్రభుత్వ జోక్యం పెరిగింది.

2015లో కేంద్ర ప్రభుత్వం పది వేలకు పైగా స్వచ్ఛంద సంస్థల ఎఫ్.సి.ఆర్.ఏ. రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసింది. 2017లో మరొక ఐదువేల వరకు సంస్థల రిజిస్ట్రేషన్‌లు రద్దు అయ్యాయి. చాలా సంస్థలకు రెండు, మూడు



ఎఫ్.సి.ఆర్.ఏ నెంబర్లు ఉండడంతో వాటిని రద్దు చేసేందుకు ప్రధానంగా ఈ ప్రక్రియ చేపట్టినప్పటికీ ఈ సంస్థలన్నీ ఏవో అవకతవక లకు పాల్పడడం వలనే ఈ రద్దు జరిగిందని ఒక భావన అందరిలో కలిగింది. దీనితోపాటు అనేక రకాల కార్యక్రమాలకు విదేశీ నిధులు పొందడాన్ని నిషేధించడం, కఠినమైన నియమ నిబంధనలు రూపొందించడం వలన గత కొద్ది సంవత్సరాలుగా దేశంలో సేవారంగానికి వచ్చే విదేశీ నిధులు గణనీయంగా తగ్గాయి.

ఇప్పుడు ఈ సెప్టెంబర్‌లో ఎఫ్.సి.ఆర్.ఏ చట్టానికి చేసిన సవరణలు స్వచ్ఛంద సంస్థలకు నిధుల అందుబాటుపై, వాటి పనితీరుపై తీవ్ర ప్రభావాన్ని చూపనున్నాయని, అనేక సంస్థలు, వాటిలో పని చేస్తున్న సిబ్బంది, వారి సేవలు పొందుతున్న ప్రజలు అందరి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారనున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అత్యంత మారుమూల ప్రాంతాలలో, అత్యంత కఠినమైన సమయాలలో కూడా నిస్వార్థంగా ప్రజా ప్రయోజనాల కోసం పని చేస్తున్న సంస్థల నైతికతను సందేహించే చర్యగా స్వచ్ఛంద సంస్థలు దీనిని అభివర్ణిస్తున్నాయి.

ప్రభుత్వ దృక్కోణం నుండి చూస్తే ప్రజోపయోగ

కార్యక్రమాల పేరుతో దేశంలోకి వస్తున్న విదేశీ నిధులు మత మార్పిడులు, ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు మళ్ళించబడుతున్నాయనేది వాదన. ఈ ఆలోచనా దృక్పథం వలన మొదట ఇబ్బందులు ఎదుర్కున్న సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్. ఎఫ్.సి.ఆర్.ఏ. నిబంధనలు ఉల్లఘించిందనే వాదనతో సెప్టెంబర్ 10న ఈ సంస్థ బ్యాంకు లావాదేవీలను ప్రభుత్వం నిలిపివేసింది. దానితో దేశంలో తమ సంస్థ కార్యక్రమాలను నిలిపి వేస్తున్నట్లు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ప్రకటించింది. ప్రస్తుతం చేసిన సవరణలలో మూడు అంశాలు స్వచ్ఛంద సంస్థల పనితీరుకు ప్రధాన ప్రతిబంధకంగా మారనున్నాయనేది ఈ సంస్థలు చేస్తున్న ఆరోపణ. వీటిలో మొదటిది స్వచ్ఛంద సంస్థలు పొందిన విదేశీ నిధులను ఇతర సంస్థలకు బదిలీ చేయడాన్ని నిషేధించడం. స్వచ్ఛంద సంస్థలు ప్రధానంగా సహకారం అనే పునాదిపై పని చేస్తాయి. దేశంలో క్షేత్ర స్థాయిలో ప్రజలలోకి చొచ్చుకునిపోయి సేవా కార్యక్రమాలను చిత్తశుద్ధితో అమలుచేస్తున్న ఎన్నో చిన్నచిన్న సంస్థలకు విదేశీ దాతృత్వసంస్థల నుండి నిధులు సేకరించుకునేంత వెసులుబాటు కానీ, నైపుణ్యాలు కానీ లేవు.

క్షేత్ర స్థాయి కార్యక్రమాలను ఎంతో సమర్ధవంతంగా నిర్వహించే సంస్థలు కూడా ఈ నిధులు పొందేందుకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయడం, వాటి పనితీరుకు సంబంధించిన నివేదికలు తయారు చేయడం వంటి విషయాలలో తగినంత నైపుణ్యం కలిగిలేవు. ఈ సంస్థలు ప్రధానంగా పెద్ద స్థాయిలో పని చేసే స్వచ్ఛంద సంస్థలతో కలిసి వాటికి అనుబంధంగా పని చేస్తుంటాయి. మంచి పేరు, పరపతి కలిగి దేశమంతటా విస్తృతంగా

కార్యక్రమాలు నిర్వహిస్తున్న పెద్ద సంస్థలు విదేశీ నిధులకు ప్రతిపాదనలు పంపి అలా పొందిన నిధులతో క్షేత్ర స్థాయిలో పని చేసే చిన్న సంస్థల ద్వారా అనేక రకాల కార్యక్రమాలు నిర్వహిస్తుంటాయి. ఇప్పుడు ఎఫ్.సి.ఆర్.ఏ చట్టంలో ఇలా నిధులు బదిలీ చేయడానికి అవకాశం లేకుండా చేసిన సవరణ వలన అనేక చిన్న స్థాయి స్వచ్ఛంద సంస్థలు, వాటి సిబ్బంది భవిష్యత్తు ప్రశార్ధకంగా మారనుంది.

ఇక స్వచ్ఛంద సంస్థలు వ్యతిరేకిస్తున్న రెండవ అంశం పరిపాలనా ఖర్చుల పరిమితిని యాభై శాతం నుండి ఇరవై శాతానికి తగ్గించడం. ఒక సంస్థ సేకరించిన మొత్తం నిధులలో ఆ సంస్థ ప్రధాన కార్యక్రమాలకు పెట్టే ఖర్చు కాక గతంలో యాభై శాతం వరకు నిధులను సిబ్బంది జీతభత్యాలు, ఆఫీస్ నిర్వహణ వంటి పరిపాలనా ఖర్చులకు కేటాయించుకునే అవకాశం ఉండేది. ఇప్పటి సవరణల వలన ఈ పరిమితి ఇప్పుడు ఇరవై శాతం మాత్రమే. ఇలా అన్ని సంస్థలకు ఈ పరిమితిని తగ్గించడం సరికాదని స్వచ్ఛంద సంస్థల వాదన.

రీసెర్చ్, అడ్వొకసీ, మానవ హక్కులు, మానవ అక్రమ రవాణా, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన వంటి కీలక రంగాలలో పని చేసే సంస్థలకు ప్రధానంగా ఉండేది పరిపాలనా ఖర్చులే అని, ఈ సంస్థలకు కూడా ఇటువంటి పరిమితి విధించడం వలన ఈ రంగాలలో స్వచ్ఛంద సంస్థలు పని చేసే అవకాశం ఉండదనేది వీరి అభిప్రాయం. విశ్వ విద్యాలయాలు, పరిశోధనా సంస్థలతో కలిసి పనిచేసే అవకాశం స్వచ్ఛంద సంస్థలకు లేకుండా పోతుందని కూడా వారు ఆందోళన చెందుతున్నారు.

ఈ చట్ట సవరణలలో మూడవ ప్రధాన అంశం విదేశీ నిధులు పొందేందుకు అనుమతి ఉన్న ప్రతి సంస్థ తప్పనిసరిగా ఢిల్లీలోని నిర్దేశించిన స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా బ్రాంచ్ లోనే ఖాతా కలిగి ఉండాలి అనేది. అన్ని ఎఫ్.సి.ఆర్.ఏ ఖాతాలు ఒకే బ్యాంకులో ఉండడం వలన దేశంలోకి వచ్చే విదేశీ దాతృత్వ సంస్థల నిధులపై పర్యవేక్షణ సులువు అవుతుందనేది ప్రభుత్వ వాదన.

అశోక యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ అండ్ ఫిలాంత్రపీ 2019లో విడుదల చేసిన ఒక నివేదిక ప్రకారం 2018-19లో దేశం మొత్తం మీద 21,490 సంస్థలు ఎఫ్.సి.ఆర్.ఏ రిటర్న్స్ ఫైల్ చేశాయి. ఇందులో కేవలం ఏడు శాతం (1488) సంస్థలు మాత్రమే ఢిల్లీలో రిజిస్టర్ అయిన సంస్థలు. మిగిలినవన్నీ దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందినవి.

ఇప్పుడు ఈ సవరణ వలన దాదాపు 20,000కు పైగా స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కొత్త బ్యాంకు ఖాతా

ప్రారంభించేందుకు ఢిల్లీ చుట్టూ తిరగాల్సి ఉంటుంది.

సెంటర్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ అండ్ ఫిలాంత్రపీ వారి నివేదిక ప్రకారం 2018-19లో దేశంలోని 380 జిల్లాలకు చెందిన 4,107 స్థానిక స్వచ్ఛంద సంస్థలకు పెద్ద సంస్థల ద్వారా 1768 కోట్ల రూపాయల మేరకు విదేశీ నిధులు అందాయి. అంటే ఒక్కో సంస్థ సరాసరిన ఏడున్నర లక్షల నిధులు పొందినట్లు. ఇప్పుడు చేసిన సవరణ వలన ఈ చిన్న చిన్న మొత్తాలలో కూడా స్వచ్ఛంద సంస్థలకు నిధులు అందకుండా పోతాయి.

ఇక చిన్నపాటి సంస్థలకు ఉన్న మరొక ఆదాయ వనరు దేశంలోని కార్పొరేట్ సంస్థలు. అయితే ఈ సంవత్సరం కార్పొరేట్ సంస్థల నిధులన్నీ ప్రధానంగా పి.ఎం కేర్స్ ఖాతాలోకి వెళ్లిపోయాయి.

కరోనా, లాక్ డౌన్ తదనంతర పరిణామాల వలన దేశంలో పేదలు, నిరుపేదలకు తక్షణ సహాయం అవసరం ఉన్నదనీ, అందుకు గానీ పెద్ద ఎత్తున నిధులు సేకరించాల్సి ఉందనే ఉద్దేశంతో ఈ ఖాతాను ప్రభుత్వం ప్రారంభించడం, పెద్ద ఎత్తున కార్పొరేట్ సంస్థలు ఈ ఖాతాకు నిధులు జమ చేయడంతో ఈ ఏడాది స్వచ్ఛంద సంస్థలకు కార్పొరేట్ సంస్థల నిధులు కొరతగా మారాయి. దేశీయ నిధులు లభ్యం కాక, విదేశీ నిధులు అందుబాటులో లేకుండా పోతే ఇక ఈ చిన్నా చితకా స్వచ్ఛంద సంస్థలు తమ కార్యకలాపాలను ఎలా కొనసాగిస్తాయనేది సమాధానం లేని ప్రశ్న.

స్వచ్ఛంద సంస్థలు పొందే విదేశీ నిధుల విషయంలో జవాబుదారీతనం, పారదర్శకత అవసరమని ప్రభుత్వం భావించడం మంచి పరిణామమే అయినా దానికోసం చేసిన సవరణలు ఆయా సంస్థల మనుగడనే ప్రమాదంలో పడవేస్తున్నాయని ఆ రంగంలోని నిపుణుల అభిప్రాయం. విదేశీ నిధులు కేవలం స్వచ్ఛంద సంస్థల ద్వారా మాత్రమే దేశంలోకి రావడం లేదనీ, ఎలక్టోరల్ బాండ్స్ రూపంలో, ఫారెన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ రూపంలో రాజకీయ పార్టీలకు, వివిధ పారిశ్రామిక రంగాలకు వచ్చే విదేశీ నిధుల పట్ల ఈ పారదర్శకత అవసరం లేదా అని వారు ప్రశ్నిస్తున్నారు.

అంత్యోదయ, సర్వోదయ అనే విలువల పునాదులపై అభివృద్ధి జరగాలనే ఉన్నత లక్ష్యం గల దేశంలో అట్టడుగు వర్గాలకు అభివృద్ధి ఫలాలను చేరవేయడంలో స్వచ్ఛంద సంస్థలు పోషిస్తున్న పాత్ర విస్మరించలేనిది. ప్రభుత్వ యంత్రాగాలు కూడా ప్రవేశించలేని మారుమూల ప్రాంతాలలో ఎన్నో కీలక సమస్యల మీద పని చేసి పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంలో, వారి హక్కుల పరిరక్షణలో ఈ సంస్థలు ఎంతో ప్రగతి సాధించాయి. సమాచార హక్కు చట్టం, ఆహార భద్రతా చట్టం, ఉపాధి హామీ చట్టం వంటి పేదలకు అనుకూలమైన చట్టాల విషయంలో కూడా ఈ సంస్థల పాత్ర ఎంతో ఉంది. కొన్ని సంస్థలలో జరిగిన అవకతవకల ఆధారంగా స్వచ్ఛంద సంస్థలన్నిటి సమగ్రతను పరీక్షకు నిలబెట్టడం సరైన చర్యకాదని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అభిప్రాయ పడుతున్నారు.

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో, పేదరిక నిర్మూలనలో కీలక పాత్ర పోషిస్తున్న స్వచ్ఛంద సేవా రంగం యొక్క సహకారం నిజానికి ప్రస్తుత పరిస్థితులలో ప్రభుత్వానికి ఎంతో అవసరం. లాక్‌డౌన్ నేపథ్యంలో దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థ మళ్ళీ గాడిలో పడాలంటే అన్ని రంగాలు, ముఖ్యంగా అత్యంత పేద వర్గాలకు చేరువగా ఉండే స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వానికి బాసటగా నిలవాల్సి ఉంది.

ఇటువంటి సమయంలో చేసిన ఈ సవరణలు ఈ రంగం యొక్క వెన్నెముకని విరిచేవిగా ఉన్నాయని, ప్రభుత్వం వీటి పట్ల పునరాలోచన చేసి సేవారంగం సమర్థవంతంగా పని చేసేందుకు తగిన వెసులుబాటు కల్పించాలని వారు కోరుతున్నారు.

సహకారం, భాగస్వామ్యం పునాదులుగా పనిచేసే స్వచ్ఛంద సేవా రంగానికి ప్రభుత్వ తోడ్పాటు అందిస్తూ, జవాబుదారీతనం, పారదర్శకత పెరిగేందుకు అందరు భాగస్వామ్యుల సూచనలను పరిగణనలోకి తీసుకుని చట్ట సవరణలు రూపొందించినట్లైతే దేశ అభివృద్ధి లక్ష్యాల సాధనలో మరింత పురోగతి సాధించగలం. ■

తనకు ఆమోదయోగ్యం కాకపోయినా ఎదుటివారి మాటలను విని, ఆలోచించే స్వభావమే మానసిక సంస్కారం

# తెలంగాణాలో నాబార్డ్ ఆర్థిక చేకూర్పు కార్యక్రమాలు




*కోవిడ్-19 లాక్‌డౌన్ సమయంలో తెలంగాణాలోని మారుమూల గ్రామాలలో సేవలందిస్తున్న మొబైల్ ఏ టి ఎం వ్యాన్లు*

**నా**బార్డ్ తన లక్ష్యానికి అనుగుణంగా ఆర్థిక అక్షరాస్యతను, బ్యాంకులకు సంబంధించిన వివిధ పథకాలపై అవగాహనను విస్తరింపజేయడంలో గ్రామీణ ప్రాంతాలలోని బ్యాంకులకు నిరంతరం తోడ్పాటు అందిస్తున్నది. ఆర్థిక అక్షరాస్యతతోపాటు ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు (ఆర్ ఆర్ బి లు), గ్రామీణ సహకార బ్యాంకులు, నిర్ణీత వాణిజ్య బ్యాంకులు (ఎస్ సి బి లు) సి బి ఎస్ + సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకోవడానికి, ఇ-ఫైన్‌టెక్ నియంత్రణ స్థాయికి తమ సామర్థ్యాన్ని పెంపొందించుకోవడానికి నాబార్డ్ తోడ్పడింది.

నాబార్డ్ తన ఆర్థిక చేకూర్పు నిధినుంచి 518 లక్షల రూపాయలను గ్రాంట్ సహాయంగా అందించి ఆర్ ఆర్ బి లు, గ్రామీణ సహకార బ్యాంకుల ద్వారా తెలంగాణాలో 74 ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలు ఏర్పాటయ్యేలా చూసింది. ఆర్థిక అక్షరాస్యత పైన శిబిరాల నిర్వహణకు, గ్రామీణ ప్రజలకు డిజిటల్ బ్యాంకింగ్, డిజిటల్ లావాదేవీలపట్ల అవగాహన కలిగించడంల ఈ ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలుకు, బ్యాంకులకు నాబార్డ్ సహకరిస్తున్నది. 2019-20 ఆర్థిక సంవత్సరంలో 233 లక్షల గ్రాంట్ సహాయంతో తెలంగాణా రాష్ట్రంలో వివిధ బ్యాంకులు 4600 కు పైగా శిబిరాలను నిర్వహించి, రెండు లక్షలకు పైగా గ్రామీణ ప్రజలకు అవగాహన కలిగిం చడంలో తోడ్పాటు అందించింది. ఇదేవిధంగా 2020 -21 ఆర్థిక సంవత్స రంలో యిప్పటివరకు తెలంగాణా రాష్ట్ర వ్యాప్తంగా ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్




అక్షరాస్యత శిబిరాలను నిర్వహించడానికి వివిధ బ్యాంకులకు 237 లక్షల రూపా యలు మంజూరు చేసింది.

తెలంగాణా రాష్ట్రంలోని గ్రామీణ ప్రజలకు బ్యాంకుల కార్యకలాపాలకు సంబంధించిన సాంకేతిక పరిజ్ఞానాన్ని కళ్ళెదుట చూపి, వాటిపై వారికి అవగాహన కలిగించడంకోసం ఒక్కొక్కటి 15 లక్షల రూపాయల వ్యయంతో 28 సంచార ఏ టి ఎం వ్యాన్‌ల కొనుగోలుకు ఆర్ ఆర్ బి లు, ఆర్ సి బి లకు నాబార్డ్ తోడ్పాటు అందించింది. బ్యాంకులకు సంబంధించిన సాంకేతికాంశాలను ప్రదర్శించి చూపడంతోపాటు, కోవిడ్-19 లాక్‌డౌన్ క్లిష్ట సమయంలో ఈ వ్యాన్లు తెలంగాణా రాష్ట్రంలోని వేలాది మారుమూల గ్రామాలలో ఏ టి ఎం సేవలను అందించడంలో ఎంతో ఉపకరించాయి.

ఇదేవిధంగా తెలంగాణాలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డి సి సి బి) లకు డిపాజిట్లను సేకరించే ఏజన్సీలుగా పనిచేస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (పి ఏ సి ఎస్) రాష్ట్రంలో 70 ఏ టి ఎం కేంద్రాలను ఏర్పాటు చేయడానికి నాబార్డ్ 135 లక్షల రూపాయల గ్రాంట్ సహాయం అందించింది. తెలంగాణా రాష్ట్రంలోని ఎస్ సి బి లు, ఆర్ ఆర్ బి లు, డి సి సి బి లకు 2226 మైక్రో ఏ టి ఎం ల ఏర్పాటుకు 480.95 లక్షల గ్రాంట్ సహాయాన్ని నాబార్డ్ సమకూర్చింది. బ్యాంకు శాఖలు లేని మారుమూల గ్రామాలలో నగదు పంపిణీ చేయడానికి వీటిని బిజినెస్ కరస్పాండెంట్లు ఉపయోగిస్తున్నారు.

డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు, డిజిటల్ లావాదేవీలకు భారత ప్రభుత్వం యిస్తున్న ప్రాముఖ్యాన్ని పరిగణనలోకి తీసుకుని గ్రామాలలో, చిన్న పట్టణాలలో 5100 పైగా పి ఓ ఎస్ మెషీన్లు ఏర్పాటు చేయడానికి వీలుగా బ్యాంకులకు 306 లక్షల రూపాయల గ్రాంట్ సహాయాన్ని నాబార్డ్ అందించింది. ఈ పి ఓ ఎస్ మెషీన్లు రాష్ట్రంలోని మారుమూల ప్రాంతాలలో డెబిట్, క్రెడిట్ కార్డులను ఉపయోగించగలిగే సాధన సంపత్తిని సమకూర్చుతాయి. ప్రభుత్వ పథకాలద్వారా అందే నగదు సహాయం నేరుగా ఖాతాదారుల ఖాతాలలో జమ అయ్యేలా చూడడానికి భారత ప్రభుత్వ 'పబ్లిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్ పోర్టల్' తో బ్యాంకులు అనుసంధానం పొందడానికి కూడా నాబార్డ్ సహకరించింది.

ఈ పథకాలను, కార్యక్రమాల అమలు ద్వారా గ్రామీణ ప్రాంతాలలోని ప్రతి కుటుంబం బ్యాంకులతో అనుసంధానం పొందడానికి , తద్వారా గ్రామాలు అభివృద్ధి చెందేలా శ్రద్ధ వహించడంతోపాటు, కేంద్రీకృత కె వై సి రిజిస్ట్రీ , అథెంటికేషన్ యూజర్ ఏజెన్సీ (ఏ యు ఏ)/ కె వై సి యూజర్ ఏజెన్సీ (కె యు ఏ) సదుపాయాలతో ఆర్ సి బి లు, ఆర్ ఆర్ బి లు సాధికారత సాధించే విధంగా శ్రద్ధ వహిస్తూ నాబార్డ్ పురోగమిస్తున్నది. ■

పరాజయానికి దారులు అనేకం, కాని విజయానికి ఒకే రహదారి

# పెరటి తోటల పెంపకంలో మెలకువలు

– లిఖిత శ్రీరాం

ఎవరి ఇంట్లో వారు స్వయంగా కాయకూరలు, ఆకు కూరలు, దుంపకూరలు, పండ్లను పండించుకోవడాన్ని పెరటి తోటల సాగు అంటారు. మన ఇంటికి పెరడు, నీటి వసతి ఉంటే పెరట్లో కూరగాయలు, పండ్ల మొక్కలను తోటలో లాగా పెంచడం వీలవుతుంది. ఇంట్లో వాడిన/మిగిలిన నీటిని ఉపయోగించవచ్చు. ఈ నీటిని సరైన కాలువలు చేసి పెరటి లోని మొక్కలకు పెట్టవచ్చు. వంటింటి వ్యర్థాలు, పశవులు వుంటే వాటి పేడని పోగుచేసి పెరట్లోనే ఒక మూల గోతిలో రోజూ వేసి అది నిండాక మట్టితో కప్పితే దానినుండి మంచి ఎరువు తయారవుతుంది. ఈ ఎరువును పెరట్లో పెంచే మొక్కలకు వాడవచ్చు. పెరటి తోటలకు ఉపయోగించే భూమిని చదును చేసు కోవడం, శ్రేష్టమైన విత్తనాలను ఎంపిక చేసి వాటిని విత్తడం, ఎరువులు, క్రిమిసంహారక మందుల వాడకం వంటి విషయాలలో శ్రద్ధవహించాలి.



**కూరగాయల, పండ్ల పెంపకం**

పాలకూర, తోటకూర, బచ్చలి కూర, అరటి, వంగ, బెండ, బీర, పొట్ల, దొండ, టమేటా వంటి కూరగాయలు, బొప్పాయి, జామ, అరటి, దానిమ్మ, సపోటా వంటి పండ్ల మొక్కలను పెరటి తోటలలో పెంచవచ్చును.

**పెరటి మొక్కలతో ప్రయోజనాలెన్నో**

**1) ఆహారం**

ఏడాది పొడవున విటమిన్లు, సూక్ష్మ పోషకాలు అధికంగా కలిగిన కూరగాయలు, పండ్లు తాజాగా ప్రతిరోజూ అందుబాటులో ఉంటాయి

**2) ఆరోగ్యం**

అన్ని పోషకాలు అందటం వలన మంచి ఆరోగ్యం చేకూరుతుంది. సేంద్రియ ఎరువుల ద్వారా పండిచటం వలన అనారోగ్యం కలుగ చేసే రసాయనాలు ఉండవు. రసాయనాల వలన కలిగే చాలా జబ్బులనుండి రక్షణ కలుగుతుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

**3) ఆదాయం**

పండ్లు, కూరగాయల కొనే అవసరం లేదు కనుక డబ్బు ఆదా అవుతుంది. అధికంగా పండించిన వాటిని అమ్మటం వలన డబ్బు మిగులుతుంది

**4) ఆనందం**

కుటుంబసభ్యులందరూ కలసి పని చేయటం వలన సంతోషం కలుగుతుంది. పిల్లలకి చిన్నప్పటినుండే సహజ కూరగాయలు మరియు పండ్లు పెంపకంపై అవగాహన పెరుగుతుంది. మంచి అలవాటుగా మారుతుంది

**ఇంటి పంటలు – మెళుకువలు**

- వంగ, టమాట, మిరప, కాబేజీ, కాలిఫ్లవర్ వంటి కూరగాయలను నారు పోసుకొని పెంచాలి
- కంచెపైన వేసవిలో పొట్ల, బీర, కాకర,దోస,దొండవంటి తీగజాతి మొక్కలని, శీతాకాలంలో చిక్కుడు, బటాణి పాదులని పెంచుకోవాలి
- కాబేజీ, కాలిఫ్లవర్ వంటి దీర్ఘ కాలిక వరుసల మధ్య పాలకూర, బచ్చలి, కొత్తిమీర వంటి స్వల్పకాలిక వరుసలు వేసుకోవాలి
- బోదేకట్ల పైన కారట్, ముల్లంగి, బీట్‌రూట్ వంటి దుంప కూరగాయలను పెంచుకోవాలి
- పూల మొక్కలని కూరగాయల మొక్కలని కలిపి వేసుకోవటం వలన పురుగుల బారినుండి కూరగాయ మొక్కలని కాపాడుకోవచ్చు
- పెసర, మినుములు, అలసందలు మొక్కలు నాటటం వలన మొక్కలకి నత్రజని బాగా అందుతుంది
- ఇదే మొక్కల నుండి విత్తనాల సేకరించి తదుపరి సీజన్లో విత్తుకోవాడానికి ఉపయోగించుకోవాలి. ■

ఆమోదయోగ్యం కాని అవకాశం కంటె ఇష్టమైన దాంట్లో వైఫల్యమే మేలు

# సన్న జీవాల నష్టపరిహార పథకం

పశు సంవర్ధనం రంగం గ్రామీణ పేదరైతులకు సుస్థిర అనుబంధ ఆదాయ వనరుగా ఉంటూ గ్రామీణ ఆర్థికవ్యవస్థను ప్రభావితం చేస్తుంది. కొన్ని ప్రాంతాలలో గ్రామాలలోని పేద రైతులలో అధిక శాతం గొర్రెలు, మేకల పెంపకం ద్వారా లభించే ఆదాయంతోనే జీవనోపాధి పొందుతున్నారు. ఏ కారణం చేతనైనా వారి జీవాలు మరణించినట్లయితే, గొర్రెల కాపరులు జీవనోపాధిని కోల్పోతారు. అట్టి వారికి అండగా ఉండాలనే ఆశయంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'సన్న జీవాల నష్టపరిహార పథకాన్ని ప్రవేశపెట్టింది.

**అందించే నష్టపరిహారం**

పథక పరిధిలోని ఒక్కొక్క జీవానికి 6000 రూపాయల చొప్పున అందించడం జరుగుతుంది.

**పథక పరిధిలోని జీవాల గుర్తింపు**

స్థానిక పశువైద్యునిచే సమర్పించబడిన వయస్సు నిర్ధారిత పత్రం (దంతాల అమరికను బట్టి) ఆధారంగా

**జీవ నష్టపరిహార పరిధి**

- గొర్రెలు , మేకల పెంపకం దారులందరికీ ఈ పథకం వర్తిస్తుంది.



**అమలు చేసే సంస్థ**

పశు సంవర్ధక శాఖ పర్యవేక్షణలో ఆ శాఖ సిబ్బంది, గోపాలమిత్రులు, పశుమిత్రలు , గ్రామస్థాయి వలంటీర్లు.

**పరిహార నిధి**

ఆరంభ నిధిని ఈ పథకం కోసం ప్రత్యేకంగా రూపొందించిన పశుసంవర్ధక శాఖ పిడి ఎకౌంట్ నందు ఉంచుతారు. దానిలో 75 శాతం నిధులు ఖర్చయిన వెంటనే, తిరిగి ప్రభుత్వ నిధి నుండి విడుదల చేయడం జరుగుతుంది.

**పథక పరిధిలోని జీవాల వివరాలు**

ఒక సంవత్సరం ఆపై వయస్సు కలిగిన గొర్రెలు, మేకలు

- 3 లేదా అంతకంటే ఎక్కువ జీవాలు ఒకే సందర్భంలో ఒకేసారి చనిపోయినప్పుడు మాత్రమే ఈ పథకం వర్తిస్తుంది.
- ఒక సంవత్సంంలో ఒక కుటుంబానికి 1,20,00/– రూపాయ లకు మించకుండా పరిహారం అందించబడుతుంది.

**నష్టపరిహారం చెల్లించే సందర్భాలు**

- ప్రమాదాల వలన మరణాలు (వరదలు, తుఫాన్, పిడుగుపాటు, అగ్ని ప్రమాదాలు, రోడ్డు, రైలు ప్రమాదాలు, పాముకాటు, క్రూరమృగాల దాడి,

విషప్రభావాలు, నీళ్ళలో మునిగి, మెడతాడు బిగుసుకొని మరణించటం, విద్యుత్ ప్రమాదాలు మొదలగునవి)

- వ్యాధులు (టీకాలు వేయించినవి), శస్త్రచికిత్స మరణాలు, దొమ్మీలు, కొట్టాటల్లో చనిపోయినవి
- రాష్ట్ర ఉపశమన నిధి లేదా జాతీయ ఉపశమన నిధి క్రిందకు రాని సందర్భాలలో చనిపోయిన జీవాలు

**నష్టపరిహారం చెల్లించబడని సందర్భాలు**

- రైతు అజాగ్రత్త లేదా నిర్లక్ష్యం వలన
- ఉద్దేశ్యపూర్వక చర్యలు, దొంగతనం, నిర్దిష్ట పరిమితిని మించి వాహనంలో గుంపుగా కిక్కిరిసి రవాణా చేయటం, నైపుణ్యం లేని చికిత్స
- ఇతర పథకాలలో నష్టపరిహారం అందుకున్న జీవాలకు ఈ పథకము వర్తించబడదు.

**పరిహారం చెల్లింపు విధానం :**

- పరిహారానికి అదనంగా మృతదేహాన్ని గుంతతీసి పూడ్చటానికి ఒక్కొక్క సందర్భానికి 500 రూపాయల చొప్పున అదనంగా చెల్లిస్తారు.
- జీవాలు మరణించిన వెంటనే యజమాని సమీప పశు వైద్యశాలకు లిఖిత పూర్వకంగా తెలపాలి.
- స్థానిక పశువైద్య సిబ్బందితో పాటు గ్రామ సచివాలయంలోని పశుసంవర్ధక సహాయకులు, గ్రామస్థాయి వలంటీర్, గొర్రెల పెంపకందారుల సంఘ అధ్యక్షుడు లేదా  గొర్రెల పెంపకందారు, గ్రామ సచివాలయంలోని ఇతర ప్రభుత్వ ఉద్యోగి, గ్రామ సర్పంచ్‌తో కూడిన కమిటీ ద్వారా పంచనామా నిర్వహించి, జీవాల మరణాన్ని ధృవీకరించాలి.
- పంచనామాలో పశువైద్య సిబ్బందితో పాటు పైన పేర్కొన్న వారిలో ఇద్దరి ధృవీకరణ కచ్చితంగా ఉండాలి.
- గ్రామ సచివాలయంలోని ఏదేని ఉద్యోగితో ధృవీకరిస్తూ జీవాన్ని పూడ్చి పెట్టేటప్పుడు తీసిన ఫోటో
- చనిపోయిన జీవాలతో పాటు  యజమాని ఉన్న ఫోటోను తేది, సమయం తెలియజేస్తూ జియో కోఆర్డినేషన్ కలపి తీసిన ఫోటో యాప్‌లో నమోదు చేయాలి.
- వలస వెళ్ళినప్పుడు మరణ ధృవీకరణ పత్రాన్ని ఆ ప్రాంత పశువైద్యునితో కలిపి నిర్వహించిన పంచనామా తీసుకోవాలి. వలసదారుని స్వంత జిల్లాలో పై ధృవీకరణ పత్రం సమర్పించి పరిహారాన్ని పొందవచ్చు.
- ఏదేని జీవం మరణానికి సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదై వుంటే, పోస్ట్‌మార్టమ్ రిపోర్ట్ సమర్పించాలి.
- లబ్ధిదారులు క్లెయిమ్ ఫారంతో పాటు పంచనామా రిపోర్ట్, బ్యాంకు ఎకౌంటు వివరాలను, (యజమాని పేరు, బ్యాంకు పేరు, బ్రాంచ్ పేరు, ఎకౌంటు నంబర్, ఐఎఫ్ఎస్‌సి కోడ్, ఎకౌంట్ పుస్తకములోని మొదటి పేజీ జిరాక్స్ కాపీ)  ఆధార్ కార్డ్ జిరాక్స్‌ను సమర్పించాలి.
- చనిపోయిన గొర్రెలకు, మేకలకు వేరే ఇన్సూరెన్స్ వర్తించే పక్షంలో  ఈ పరిహారం లభించదు
- నష్టపరిహార సొమ్ము నేరుగా యజమాని బ్యాంకు ఖాతాకు జమ చేయబడుతుంది
- జిల్లాలోని సంయుక్త సంచాలకులు, సంచాలకుల కార్యాలయములోని ఉప సంచాలకులు ఈ పథకాన్ని పర్యవేక్షిస్తారు.

**క్లెయిమ్ ప్రాసెసింగ్ ఫీజు**

- ఒక్కొక్క జీవానికి 40 రూపాయల చొప్పున ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ స్థాయి వలంటీర్లకు కార్పస్ నిధి నుండి రుసుము లేదా పారితోషికం చెల్లించబడుతుంది.

**ఫిర్యాదుల పరిష్కార విధానం**

- సన్న జీవాల నష్టపరిహార పథకానికి సంబంధించి అన్నిరకాల ఫిర్యాదులను స్వీకరించి పరిష్కరించడానికి పరిష్కార వేదికను సంచాలకుల వారి కార్యాలయము లోను, అన్ని జిల్లాలలోని సంయుక్త సంచాలకుల కార్యాలయాలలోను ఏర్పాటు చేయడం జరిగింది.

ఫిర్యాదుల కొరకు సంప్రదించవలసిన చిరునామా

స్థానిక పశువైద్య కేంద్రము లేదా 08500001962 ■

# పేద మహిళలను ఆదుకునే పెన్నిధి 'స్త్రీనిధి' !

పేద మహిళలను మైక్రో ఫైనాన్స్ సంస్థలు విధించే అధిక వడ్డీ రేటు నుంచి, బలవంతపు వసూళ్ళ బారినుంచి విముక్తి కలిగించి పేదరిక నిర్మూలనకు పాటు పడటానికి ఉద్భవించిన సంస్థ స్త్రీనిధి.

*స్త్రీనిధి ఆశయాలు, అందించే సహాయం, రుణం పొందడానికి అర్హతలు, పాటించవలసిన నియమాలు, చేయకూడని పనులు, ఇతర విధి విధానాలను వివరిస్తూ సభ్యుల అవగాహనకోసం ' స్త్రీనిధి క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్' ఒక కరదీపికను ప్రచురించింది. ఆ సంస్థ సౌజన్యంతో 'మహిళా సాధికారత' పాఠకుల కోసం ఆ వివరాలను ఇక్కడ అందిస్తున్నాం.*

తెలంగాణా రాష్ట్రంలో రుణ లభ్యత లేని మారు మూల ప్రాంతాలలో సహితం నిరుపేద మహిళ లకు తక్షణ రుణ సౌకర్యం అందించడానికి మండల లేదా పట్టణ సమాఖ్యలు, రాష్ట్ర ప్రభుత్వం వాటా దారులుగా ఉమ్మడి భాగస్వామ్యంతో, సెర్ప్ లేదా మెప్మా సహకారంతో నిర్వహిస్తున్న సంస్థ స్త్రీనిధి.

తెలంగాణ కో-ఆపరేటివ్ సొసైటీల చట్టం1964 ప్రకారం 2011 సెప్టెంబర్ 7వ తేదీన 'స్త్రీనిధి క్రెడిట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్' గా రిజిస్టర్ చేయబడి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని సంఘ సభ్యులకు తక్కువ వడ్డీతో, తక్కువ సమయంలో ఆర్థిక సేవలను అందించే స్త్రీనిధిలాంటి సంస్థ మన దేశంలో కాదు ప్రపంచంలోనే లేదని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. ఇది గర్వకారణమైన విషయం.

**స్త్రీనిధి ఉద్దేశాలు, సేవలు**

సంఘ సభ్యుల కుటుంబ ఆదాయం పెంచుటకు కావలసిన జీవనోపాధుల కొరకు రుణాలు; అత్యవసర లేదా వినియోగ అవసరాల కొరకు రుణాలు; సంఘాలు , సంఘ సమాఖ్యలు పొదుపు చేయుటకు పొదుపు పథకాలు, బ్యాంకులకు ప్రతినిధిగా మారుమూల గ్రామాలలో బ్యాంకింగ్ సేవలు, పెన్షన్లు, ఉపాధి వేతనాలను, ఇతర చెల్లింపులు, మీ-సేవ మొదలగు సేవలను స్త్రీనిధి అందిస్తున్నది.

**స్త్రీనిధి ముఖ్య ఉద్దేశాలు:**

- పేద, నిరుపేద మహిళల ఆర్థిక అవసరాలు తీర్చటం.
- అధిక వడ్డీ రుణాల అవసరం లేకుండా సమయానికి తక్కువ వడ్డీకి రుణాలను అందించడం.
- జీవనోపాధులకు రుణాలనందించి కుటుంబ ఆదాయం పెంచటం, పేదరిక నిర్మూలనకు పాటుపడటం.
- స్వయం సహాయక సంఘాల, సమాఖ్యల ఆర్థిక పరిపుష్టి కొరకు తోడ్పాటు

**స్త్రీనిధి ప్రత్యేకతలు**

- సాంకేతికత సహాయంతో మారుమూల గ్రామాలలోని పేద మహిళల ఇంటి ముంగిట్లో స్త్రీనిధి సభ్యులకు ఆర్థిక సేవలందించటమే కాకుండా సంఘాలు , వాటి సమాఖ్యలలో పారదర్శకత , ఆర్థిక క్రమశిక్షణను పెంపొం దిస్తున్నది. స్త్రీనిధి పనితీరులో ప్రత్యేకతలు:
- స్త్రీనిధి లావాదేవీల కొరకు అయ్యే వ్యయాన్ని సభ్యుల/ సంఘ / సమాఖ్య సంస్థల భాగస్వామ్యంతో తక్కువ ఖర్చుతో రుణాలు మంజూరు చేయుట.
- అప్పు అడిగిన 48 గంటలలో రుణాలు మంజూరు చేయుట.
- పేద నిరుపేద మహిళలకు ఎక్కడ లేని విధంగా ప్రత్యేక రుణ పరిమితి కేటాయింపు.
- సభ్యులలో ఆర్థిక క్రమశిక్షణను పెంపొందించటానికి బ్యాంకు లింకేజిలో బకాయి ఉన్న సంఘాలకు అప్పుఇవ్వకపోవడం.
- గ్రామ/స్లమ్ సమాఖ్యలకు కేటాయించిన రుణ

పరిమితులు మించకుండా తిరిగి చెల్లించిన మొత్తాలను సభ్యుల అవసరాలను తీర్చేందుకు (క్యాష్ క్రెడిట్ పద్ధతిలో) ఉపయోగించి, సభ్యులు అధిక వడ్డీకి తెచ్చే అప్పులను తగ్గించుట.

**స్త్రీనిధి నుండి పొందే రుణాలకు ప్రభుత్వ నిబంధనల మేరకు వడ్డీ లేని రుణ పథకం (విఎల్ఆర్) వర్తిస్తుంది**

**స్త్రీనిధి ఆర్థిక సేవల వలన ప్రయోజనాలు**

స్త్రీనిధి నుండి సభ్యులు పొందే ప్రయోజనాలు బ్యాంకులతో కాని ఇతర ఏ సంస్థలతో వలన వచ్చే ప్రయోజనాల కన్నా చాలా ఎక్కువ. ఇవి క్రింద తెల్పబడినవి.

- స్వయం సహాయక సంఘ సభ్యుల రుణాల కొరకు టాబ్లెట్ పి.సి ద్వారా ఏ రోజైనా గ్రామ / స్లమ్ సమాఖ్యల ద్వారా ఎటువంటి ఖర్చు లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చు.
- స్త్రీనిధికి రుణ దరఖాస్తు చేసిన సమయం నుండి 48 గంటల్లో రూ.30,000/- వరకు సభ్యురాలు రుణం పొందవచ్చు. రూ. 30,000/-ల నుంచి రూ. 3,00,000/- ల వరకు సభ్యురాలు 15 రోజుల లోపు రుణం పొందవచ్చు.
- తక్కువ వడ్డీతో స్త్రీనిధి రుణ వితరణ : స్త్రీనిధి రుణాలపై ప్రస్తుతం విధించే వార్షిక వడ్డీ రేటు 12.50% నుంచి 10% అనగా 1.25% గ్రామ/స్లమ్ సమాఖ్యలకు మరియు 2% అనగా 0.25% మండల/పట్టణ సమాఖ్యలకు, స్త్రీనిధి కార్యక్రమాలను అమలు చేయుటకు అయ్యే ఖర్చుల కొరకు మరియు సమాఖ్యలను బలోపేతం చేయటానికి తిరిగి ఇస్తుంది. అందువలన స్త్రీనిధి అప్పులపై సంఘాలు నికరంగా చెల్లించే వడ్డీ శాతం 11% మాత్రమే (12.50-1.50). ఇది సమాఖ్యలకు ఎంతో లాభం. బ్యాంకులకు సంఘాలు చెల్లించే వడ్డీ మొత్తములో సమాఖ్యలకు ఎలాంటి మొత్తము తిరిగిరాదు.
- స్త్రీనిధి రుణాలు పొందే సంఘాలు బ్యాంకుల్లో లాగ ఎలాంటి అదనపు రుసుములు అనగా ప్రాసెసింగ్, డాక్యుమెంటేషన్, తనిఖీ చార్జీలు, లెడ్జర్ ఫోలియో మరియు ఎలాంటి ఇతర ఖర్చులు చెల్లించాల్సిన అవసరం లేదు. బ్యాంకులకు వెళ్ళడానికి అయ్యే రవాణా ఖర్చులు మరియు వారి దినసరి వేతన నష్టము మొదలగు వాటిని పరిగణనలోకి తీసుకొన్నప్పుడు, స్త్రీనిధి విధించే వడ్డీ శాతము బ్యాంకులు విధించే వడ్డీ శాతము కన్నా తక్కువ. అలాగే బ్యాంకులలో ఉన్న డిపాజిట్ల పట్ల కోల్పోయిన ఆదాయం లెక్కిస్తే స్త్రీనిధి రుణంపై వడ్డీ ఇంకా తక్కువ. స్త్రీనిధి సంఘ సమాఖ్యల మరియు ప్రభుత్వ భాగస్వామ్యం ఉన్న సంస్థ అయినందున సంఘాలకు ఎలాంటి నష్టం జరిగే చర్యలకు తావివ్వదు.
- బ్యాంకుల్లో రుణం మంజూరు చేసేటప్పుడు, సాధారణంగా ఫిక్స్‌డ్ డిపాజిట్ తీసుకోవడం లేక సేవింగ్స్ ఖాతాలో ఉన్న డబ్బును విత్ డ్రా చేయనివ్వక పోవటం జరుగుతుంది. ఇట్టి విధానం స్త్రీనిధిలో లేదు.
- అవసరం ఉన్న సంఘ సభ్యురాలు మాత్రమే స్త్రీనిధి నుండి అప్పు పొందడం వలన స్త్రీనిధిలో రుణాలను అందరు సభ్యులు సమానంగా పంచుకునే విధానం లేదు.
- కుటుంబ జీవనోపాధి ప్రణాళిక (హెచ్ ఎల్ పి) ను సిద్ధం చేయడం ద్వారా రుణ అవసరాన్ని అంచనా వేసి సభ్యురాలికి అవసరమైన అప్పును అందించటం జరుగుతుంది.
- స్త్రీనిధి లాభాపేక్ష లేని సంస్థ కాబట్టే సంఘాలు / గ్రామ/ స్లమ్ / మండల / పట్టణ / జిల్లా సమాఖ్యలు స్త్రీనిధిలో పెట్టిన డిపాజిట్లపై, బ్యాంకులు చెల్లించే వడ్డీకన్నా ఎక్కువ వడ్డీని స్త్రీనిధి చెల్లిస్తుంది. వివరాలు క్రిందిపట్టికలో ఇవ్వబడినవి.

| బ్యాంకులు | | స్త్రీనిధి | |
|---|---|---|---|
| **బ్యాంకు పేరు** | **డిపాజిట్‌పై వడ్డీరేటు (3సం.పైబడి)** | **డిపాజిట్ పథకము** | **వడ్డీరేటు** |
| ఎస్.బి.ఐ | 6.75% | సమృద్ధి | 7.50 |

| | | | |
|---|---|---|---|
| ఆంధ్రాబ్యాంకు | 6.25% | సంకల్ప | 8.00% |
| ఎపిజివిబి, టిజిబి | 6.60% | సిఐఎఫ్ కార్పస్ డిపాజిట్ | 9.00% |

- ప్రతి సంవత్సరం గ్రామ/స్లమ్ సంఘాలకు మరియు మండల/పట్టణ సమాఖ్యలను స్త్రీనిధి గ్రేడింగ్ చేసి దాని ఆధారంగా రుణ పరిమితి కేటాయిస్తుంది. ఈ విధానం వలన సమాఖ్యలు తమ పనితీరును తెలుసుకుని మెరుగుపరుచుకొనే అవకాశం ఉంటుంది.
- ఒక్కొక్క సంఘం కేవలం రూ. 2,400/- నుండి రూ. 7,200/- సమృద్ధి పొదుపు చేస్తే ఆ సంఘానికి 50-150 రెట్లు రుణాలను మంజూరు చేసే ఏకైక సంస్థ స్త్రీనిధి.
- రుణం పొందిన సభ్యురాలు ఏ కారణం చేతనైన మరణిస్తే సురక్ష బీమా వర్తింప చేసి నిల్వ ఉన్న రుణ మొత్తం మినహాయించి మిగతా మొత్తాన్ని మరణించిన సభ్యుల వారసులకు అందించబడుతుంది. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలకు ఈ సదుపాయం లేదు.
- స్త్రీనిధి ఆదాయంలో కొంత భాగం సామాజిక బాధ్యతలో భాగంగా క్రింద తెల్పిన సంక్షేమ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తున్నారు.

➪ ప్రతి మండల/పట్టణ సమాఖ్యలో ఉన్న సంఘ సభ్యుల పిల్లలలో ప్రతిభావంతులైన ఇద్దరు విద్యార్థులకు సంవత్సరానికిరూ. 2,500/- చొప్పున రెండు సంవత్సరములకు రూ. 5,000/- లను, 10వ తరగతి తర్వాత విద్యను అభ్యసించటానికి ఉపకార వేతనంగా చెల్లిస్తారు.

➪ సెర్ప్ / మెప్మా సిబ్బంది మరణిస్తే ఎక్స్‌గ్రేషియా చెల్లించుట కొరకు.

➪ వికలాంగుల సంక్షేమం కోసం నైబర్ హుడ్ సెంటర్‌ల నిర్వహణకు స్త్రీనిధి నికర లాభం నుంచి 2% నిధులు ప్రతి సంవత్సరము కేటాయించుట.

➪ స్త్రీనిధి ఆర్జించే నికర లాభం నుండి ప్రతి సంవత్సరము 0.25% కమ్యూనిటీ సంక్షేమ నిధికి కేటాయించి అత్యంత నిస్సహాయత స్థితిలో ఉన్న స్వయం సహాయక సంఘాల సభ్యురాలికి ఆర్థిక చేయూతనివ్వటానికి రూ. 25,000/- వరకు చెల్లిస్తుంది.

➪ స్త్రీనిధి సేవలు సంఘ సభ్యులకు అందించుటకు, సంఘాలు మరియు సంఘ సమాఖ్యలు పునాదిగా ఉన్నాయి. సరిగ్గా పని చేయని కొన్ని ఎం ఎస్‌లు/ టి ఎఫ్ లు మరియు వి ఓలు / ఎస్ ఎల్ ఎఫ్ లను బలోపేతము చేయుటలో స్త్రీనిధి నికర లాభం నుండి ప్రతి సంవత్సరము 5% కేటాయింపు. ఈ విధంగా ఆ సమాఖ్య పరిధిలో ఉన్న సంఘాల సభ్యులకు అవసరమైన రుణాలు మరియు సేవలు అందించేటట్లు చూడటం.

➪ స్త్రీనిధి నుంచి ఇన్ని లాభాలున్నందున చాలా ఎక్కువ సంఖ్యలో సభ్యులు రుణాలను పొంది, తద్వార జీవనోపాదులను ఏర్పాటు చేసుకొని, తమ కుటుంబ ఆదాయాన్ని గణనీయంగా పెంచుకోవాలి.

సమాచారంకోసం లేదా ఫిర్యాదులకోసం
డయల్ చేయవలసిన
ఫోన్ నంబరు: 7997445588

సందేహాల నివృత్తి కోసం లేదా ఫిర్యాదులకు మిస్డ్ కాల్ ఇచ్చినట్లయితే స్త్రీనిధి ప్రధాన కార్యాలయం నుండి మీకు తిరిగి కాల్ చేస్తారు. కాల్ వచ్చినపుడు మీరు అందుబాటులో ఉండాలి.

**స్త్రీనిధి ప్రధాన కార్యాలయం చిరునామా:**


స్త్రీనిధి క్రెడిట్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్,
4వ అంతస్తు, 5-9-22/బి, మై హోమ్ సరోవర్‌ప్లాజా,
సెక్రటేరియట్ రోడ్, సైఫాబాద్, హైదరాబాద్- 500 063.
ఫోన్ : +91-40-23329 2090,
ఫాక్స్ : +91-40-2339 2003 ; వెబ్‌సైట్ :
www.streenidhi.telangana.gov.in

# గ్రామాల రూపురేఖలు మార్చిన భాస్కర్ !

**- ఎం. నాగిరెడ్డి**

*27 సంవత్సరాలుగా శ్రీ భాస్కర్ ఉద్యోగ ప్రస్థానమంతా గ్రామీణాభివృద్ధి, పేదరిక నిర్మూలన, ఆదర్శ గ్రామాల రూపకల్పన రంగాలలోనే గడచింది. అది ప్రారంభ ఉద్యోగ పర్వం 'ఆర్టిక్ సంస్థ' అయినా, లయ సంస్థ అయినా, గాంధీ శాంతి కేంద్రమైనా, సెర్ప్ సంస్థ అయినా, ఏపిమాస్ అయినా శ్రీ భాస్కర్‌కు గ్రామసీమలతోనే అనుబంధం. గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడంలో, గ్రామీణుల జీవితాలలో కొత్త వెలుగులు నింపడంలో అలుపెరుగని శ్రామికుడాయన.*

శ్రీకాకుళం జిల్లాలో ఖద్దర్‌కు ప్రసిద్ధి చెందిన పొందూరు గ్రామంలో శ్రీ రాజాపంతుల రామారావు, శ్రీమతి చిన్నమ్మడు దంపతులకు 1968 జూన్ 10న ప్రధమ సంతానంగా జన్మించిన శ్రీ భాస్కర్ పూర్తి పేరు రాజాపంతుల యామిని వెంకట సూర్య విజయ భాస్కరరావు.




చరిత్ర శాస్త్రంలో పట్టా పొంది, తను నేర్చుకున్న విద్యకు భిన్నంగా తనకు నచ్చిన సేవా రంగం పట్ల ఆసక్తితో పేదలకు చేతనైనంత సహాయం, తోడ్పాటు, అవకాశాలు అందించే ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలలో తన ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు.

శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో కొన్ని స్వచ్ఛంద సంస్థలలో, జిల్లా పేదరిక నిర్మూలన కార్యక్రమం (వెలుగు) లో పనిచేసి 2007 జనవరిలో ఏపిమాస్ సంస్థలో చేరి కృష్ణా, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వయంసహాయ సంఘాలను బలోపేతం చేయడంలోను, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనలోను గణనీయంగా కృషిచేశారు.



ఆనాటి 'ఆర్టిక్' సంస్థ డైరెక్టర్ శ్రీ హెచ్.ఆర్.ప్రకాష్ గారి ఆధ్వర్యంలో 1993 నుండి 1995 డిసెంబర్ వరకు కమ్యూనిటి ఆర్గనైజర్‌గా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలను సంఘటితపరచి, వారిని బృందాలుగా తయారుచేసి, ఆ బృందాలను వారం వారం సమావేశపరిచి వారికి పొదుపు అలవాటు నేర్పించి, వారు తమ కుటుంబాల చిన్నపాటి అవసరాలకు ఎదుటివారిపై ఆధారపడ కుండా తాము ఏర్పరచుకున్న సంఘాల తోడ్పాటు పొంది, స్వయం సహాయంతో జీవించే విధంగా అవగాహన కల్పించి, స్వయంసహాయ ఉద్యమ బలోపేతానికి తన వంతు కృషిచేశారు.

1996 జనవరి నుండి 1997 డిసెంబరు వరకు విశాఖపట్నానికి చెందిన 'లయ' సంస్థ తరఫున గ్రామీణ ప్రాంతాల్లో చేతి వృత్తుల వారి స్థితిగతులను అధ్యయనం చేయడంతో పాటు, మహిళలను సంఘటిత పరచి, వారిని బృందాలుగా, స్వయం సహాయ సంఘాలుగా ఏర్పరచి బలోపేతం చేయుట, రాత్రి పాఠశాలల ద్వారా విద్యను ప్రోత్సహించడానికి తన వంతు కృషి చేశారు.

డిశంబరు 1997 నుండి సెప్టెంబర్ 2000 వరకు

**(మిగతా 22వ పేజీలో)**

మంచితనం అంటే అందరినీ సంతోషపెట్టడం అనికాదు, అది అసాధ్యం; ఎవరినీ నొప్పించకుండా వుండడమే మంచితనం !

# మహిళా నాయకత్వానికి వన్నెతెచ్చిన రెడ్డెమ్మ !

**- రామసముద్రం ఏపిమాస్ బృందం**

*శ్రీమతి ఎన్.రెడ్డెమ్మ చదువుకున్నది పదవ తరగతే అయినా, చక్కని అవగాహనతో, వాక్చాతుర్యంతో సంఘ సభ్యురాలినుంచి, గ్రామ సంఘం అధ్యక్షురాలిగా, మండల సమాఖ్య అధ్యక్షురాలిగా, గ్రామ రైతు సంఘం అధ్యక్షురాలిగా, మండల రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్ పి ఓ) అధ్యక్షురాలిగా ఎదిగి, ఆ పదవులను సమర్థంగా నిర్వహిస్తూ మహిళా చైతన్యానికి మారుపేరుగా నిలిచారు. కుటుంబపరంగా వ్యవసాయం, పశుపోషణతో కూడా తమ సామర్థ్యాన్ని చాటుకుంటున్నారు.*

సాధారణ రైతు కుటుంబంలో జన్మించి స్వయం సహాయ సంఘ సభ్యురాలిగా, గ్రామ రైతు సంఘం అధ్యక్షురాలిగా, మండల రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్ పి ఓ) అధ్యక్షురాలిగా ఆ సంస్థలను సమర్థంగా నిర్వహిస్తూ, ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్యక్రమాలలోను, మండలంలో ఏపిమాస్ ద్వారా చేపట్టిన అనేక కార్య క్రమాలలోను చురుకుగా పాల్గొంటూ మహిళా చైతన్యానికి నిదర్శనంగా నిలిచారు




చిత్తూరు జిల్లా రామసముద్రం మండలం, నారేవారిపల్లి నివాసి శ్రీమతి ఎన్.రెడ్డెమ్మ . రామసముద్రం ఏపిమాస్ బృందానికి ఆమె తన జీవన ప్రస్థానాన్ని క్లుప్తంగా వివరించారు.



చిత్తూరు జిల్లా తంబళ్ళపల్లి మండలం బురుజుపల్లి నివాసులు అయిన శ్రీ ఆదినారాయణ నాయుడు, శ్రీమతి రమణమ్మ గార్ల సంతానమైన రెడ్డెమ్మ 10వ తరగతి వరకు తమ ఊరిలోనే చదువుకున్నారు. తన 19వ ఏట రామసముద్రం మండలం, పెద్దకురపల్లి పంచాయతీ నారేవారిపల్లి నివాసి శ్రీ ఎన్.జనార్ధన్‌తో వివాహం కావడంతో రామసముద్రం మండలంతో ఆమెకు ముడి పడింది. తన తండ్రి వివోఏ కావడం వలన, తండ్రితో పాటు చిన్నతనం నుండి ప్రజోపయోగమైన కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనుట వలన వివాహమైనప్పటినుండి రామసముముద్రం మండలంలో కూడా ప్రజోపయోగ కార్యక్రమాలలో ఆమె క్రియాశీలంగా పాల్గొంటున్నారు. రెడ్డెమ్మకు ఇద్దరు కుమారులు. ఒక అబ్బాయి డిగ్రీ, చిన్నబ్బాయి పదవ తరగతి చదువుతున్నారు.

శ్రీమతి రెడ్డెమ్మ తమకున్న 3 ఎకరాల పొలంలో వివిధ రకాల పంటలు పండించడం తో పాటు 50 గొర్రెల పోషణతో తమ కుటుంబ జీవనోపాధులను మెరుగు పరుచుకుంటూ కుటుంబ అభివృద్ధికి దోహదపడు తున్నారు. రామసముద్రం మండలం లోనూ, చుట్టూ ప్రక్కల జరిగే అనేక సమావేశాలకు హాజరవుతూ ఒకవైపు సమాజాభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొంటూనే, మరోవైపు తమ భర్తకు కుటుంబ కార్యక్రమాలలో తోడ్పాటు అందిస్తూ మన్ననలను పొందుతున్నారు.

**స్వయంసహాయ ఉద్యమంలో కీలక పాత్ర**

వివాహమైన కొత్తలోనే తమ గ్రామంలోని స్వయం సహాయ సంఘంలో సభ్యురాలిగా చేరి, తన వాక్చాతుర్యం, సమర్థతతో సంఘ ప్రతినిధిగా, గ్రామ సంఘం అధ్యక్షురాలిగా, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా ఎదిగి నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు జరిపిన "స్త్రీనిధి" విజయోత్సవాలకు విజయవాడకు వెళ్ళి



అక్కడ తమ సామర్థ్యంతో చిత్తూరు జిల్లా స్వయంసహాయ ఉద్యమ ఖ్యాతిని పెంపొందించారు..

**ఏపిమాస్‌తో అనుబంధం**

రామసముద్రం మండలంలో ఏపిమాస్ సంస్థ 2016 సంవత్సరం నుండి అమలు జరుపుతున్న 'హరిత నవీకరణ కార్యక్రమం'లో భాగంగా గ్రామాలలో రైతు సంఘాలను, పంచాయతీ స్థాయిలో గ్రామ రైతు సంఘాలను ఏర్పాటు చేయడం జరిగింది. రైతు సంఘంలో సభ్యురాలిగా ఏపిమాస్ తో శ్రీమతి రెడ్డెమ్మ అనుబంధం మొదలైంది. అనంతరం ఆమె గ్రామ రైతుసంఘం అధ్యక్షురాలిగా ఎదిగారు. 2019లో రామసముద్రం మండలంలోని చొక్కాండ్లపల్లి వాటర్‌షెడ్ పరిధిలో చేపట్టిన సామాజిక తనిఖీలో గ్రామస్థాయి సామాజిక తనిఖీ కార్యకర్తగా పనిచేసి ఒకవైపు వాటర్‌షెడ్ కార్యక్రమాల సామాజిక తనిఖీతో పాటు ఏపిమాస్ చేపట్టిన రైతు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి మండల స్థాయిలో జరిగిన బహిరంగ సభలో ఏపిమాస్ చేపట్టిన కార్యక్రమాలను అందరికీ తెలియజేయడంలో ప్రధాన భూమిక పోషించి జిల్లాస్థాయి అధికారుల మన్నలను పొందారు.

శ్రీమతి రెడ్డెమ్మలోని చురుకుదనం, ఉత్సాహం చూసిన మండల రైతు ఉత్పత్తిదారుల సంస్థ 2020 ఆగస్టులో జరిగిన వార్షిక మహాసభలో సంస్థ అధ్యక్షురాలిగా ఎన్నుకోవడం జరిగింది. ప్రస్తుతము రైతు ఉత్పత్తిదారుల సంస్థ వ్యాపార కమిటీ అధ్యక్షులుగా కూడా శ్రీమతి రెడ్డెమ్మ పని చేస్తున్నారు.

మదనపల్లి కేంద్రంగా ఏర్పాటైన జిల్లా స్థాయి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ (ఎం–టొమాటో ఎఫ్.పి.సి.) కి రామసముముద్రం ఎఫ్‌పిఓ ప్రతినిధిగా హాజరై మండల స్థాయిలో జరిగే వివిధ అభివృద్ధి కార్యక్రమాలను అందరికీ తెలియజేయడంలో సఫలీకృతులు అవుతున్నారు. ఏపిమాస్ ద్వారా టమాట పంటలో ఖర్చు తగ్గించే కార్యక్రమాలలో భాగంగా అమలు జరిపే వివిధ రకాల పంట యాజ మాన్య పద్ధతులను తమ పొలములో చేపట్టి గ్రామములోని ఇతర రైతులకు మార్గదర్శి అయ్యారు.

**ఏపిమాస్ ద్వారా పొందిన శిక్షణలు:**

ఏపిమాస్, జి.ఐ.జడ్ సంయుక్తంగా 2018లో గుజరాత్ లోని 'సేవ' సంస్థకు ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర ప్రతినిధులతో ఏర్పాటు చేసిన క్షేత్ర సందర్శనలో రామ సముద్రం నుండి పాల్గొని అక్కడ జరిగే వివిధ రకాల కార్యక్రమాలను అధ్యయనం చేసి రామసముద్రం సభ్యులకు తెలియజేశారు. పంచాయతీ స్థాయిలో, మండల స్థాయిలో ఏపిమాస్ ఏర్పాటు చేసిన వివిధ శిక్షణలకు హాజరై అభివృద్ధి కార్యక్రమాలలో మహిళల పాత్రకు ఉదాహరణగా నిలిచారు. ఏపిమాస్ సంస్థ రూపొందించిన ఎఫ్‌పిఓ 6 మాడ్యూల్‌పై శిక్షణ పొందారు.

**ఏపిమాస్ చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు**

రామసముద్రం మండలంలో ఏపిమాస్ ఆధ్వర్యంలో ఏర్పాటైన రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా ఇప్పటికే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టం జరిగింది. అవి ఈ ఫ్రెష్ వారి సాంకేతిక సహకారంతో 'రైతు సమృద్ధి కేంద్రాన్ని' ఏర్పాటు చేసి అందులో రైతులకు కావలసిన వివిధ రకాల ఎరువులు, క్రిమిసంహారక మందులు, పశువుల దాణా, స్ప్రేయర్లు, టార్పాలిన్ పట్టలు మొదలగునవి మిగతా షాప్‌ల కన్నా తక్కువ ధరకు అందించడంలో రైతులకు బాగా ఖర్చు తగ్గుతున్నది.

అంతేగాక యూరియా ఇతర దుకాణాలలో అందుబాటులో లేనపుడు ఎఫ్‌పిఓ ద్వారా తెప్పించి రైతులకు సహాయపడడం ఎంతో ఆనందం కలిగించిందని ఆమె చెప్పారు. అంతేగాక ఏపిమాస్ ద్వారా చేపట్టిన వివిద టమాట విలువు గొలుసు కార్యక్రమాలు, ఆదర్శ నర్సరీల



అభివృద్ధి, ప్రదర్శన క్షేత్రాల అభివృద్ధి, కోవిడ్ 19 ఆపత్కాలంలో ఏపిమాస్ సహకారంతో రామసముద్రం రైతు ఉత్పత్తిదారుల సంస్థ, రైతుల తోటల వద్ద నుండి 400 టన్నుల టమాటలను కొని వారికి సకాలంలో డబ్బులు చెల్లించడం మొదలుగా రైతుల అభివృద్ధికి ఏపిమాస్ చేపట్టిన వివిధ కార్యక్రమాలను శ్రీమతి రెడ్డెమ్మ కొనియాడారు.

రామసముద్రం మండలంలో రైతుల అభివృద్ధికి ఏపిమాస్ చేపట్టిన అనేక కార్యక్రమాల వలన చాలామంది రైతులు బాగు పడ్డారని అందులో తాము ఆర్థికంగా అభివృద్ధి చెందామని శ్రీమతి రెడ్డెమ్మ తెలిపారు.

"ఆపత్కాలంలో రైతులకు అండగా నేనున్నాను" అంటూ, ఏపిమాస్ ముఖ్య కార్య నిర్వహణ అధికారి శ్రీ సి.ఎస్.రెడ్డి కరోనా కల్లోలంలో కొనుగోళ్ళులేక దిగాలుపడిన టొమాటో రైతులను వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగ్ పరిశ్రమలతో అనుసంధానంచేయించి, వారు తమ పంటలను గిట్టుబాటు ధరకు విక్రయించుకునేలా చేయడం ఎంతైనా ప్రశంసనీయమైన కార్యక్రమమని ఆమె అన్నారు.

శ్రీ సి.ఎస్.రెడ్డి గారికి, ఏపిమాస్ సంస్థకు రామసముద్రం రైతు ఉత్పత్తిదారుల సంస్థ తరపున, తన తరపున శ్రీమతి రెడ్డెమ్మ కృతజ్ఞతలు తెలియజేశారు. ■

## శానిటైజర్లు అతిగా వాడితే దుష్పరిణామాలు!

**క**రోనా వల్ల హ్యాండ్ శానిటైజర్ల వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. వీటిని అతిగా వాడటం వల్ల భవిష్యత్తులో తీవ్ర దుష్పరిణామాలు ఎదురవుతాయని ఎయిమ్స్ వైద్య నిపుణుల బృందం హెచ్చరించింది. యాంటీ మైక్రోబియల్ నిరోధక సామర్థ్యం పెరిగి వ్యాధికారక సూక్ష్మ జీవులపై ఔషధాల ప్రభావం తగ్గిపోతుందని వెల్లడించింది. ఇది ఇలాగే కొనసాగితే 2050 నాటికి ఔషధాలు పని చేయక ఏటా కోటి మంది ప్రమాదంలో పడతారని తెలిపింది. యాంటీ బయోటిక్స్ నిరోధకతపై ఎయిమ్స్, అమెరికా సొసైటీ ఫర్ మైక్రోబయాలజీ సంయుక్తంగా నిర్వహించిన రెండు రోజుల అంతర్జాతీయ వెబినార్‌లో పలు కీలక అంశాలను చర్చించారు. "పెరుగుతున్న ఔషధ వినియోగాన్ని అదుపు చేయకపోతే 2050నాటికి ప్రతి ఏడాది కోటిమంది ప్రమాదంలో పడతారు. ప్రస్తుత పరిస్థితుల్లో అతిగా వినియోగిస్తున్న హ్యాండ్ శానిటైజర్ల వల్ల భవిష్యత్తులో పరిస్థితులు మరీ దారుణంగా మారతాయి" అని వైద్య నిపుణులు అభిప్రాయపడ్డారు.

### మాస్కులను ఉతకకుండా ధరిస్తే కరోనా ముప్పు

**క**రోనా సోకకుండా తీసుకుంటున్న ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ధరించే క్లాత్ మాస్కులను ఉతకకుండా కపదేపదే వినియోగించడంవల్ల కరోనా సోకే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని ఆస్ట్రేలియాలోని యూనివర్శిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ అధ్యయనంలో వెల్లడైంది. అంతేకాదు... అధిక ఉష్ణోగ్రత ఉన్న నీటితో క్లాత్ మాస్కులను వాష్ చేయాలని సూచించింది. ఇలా బాగా వేడి నీటితో క్లాత్ మాస్కులను వాష్ చేసి మళ్లీ ధరించడం వల్ల వైరస్ సోకే అవకాశాలు తక్కువగా ఉంటాయని తెలిపింది. ■

# గ్రామాల రూపురేఖలు మార్చిన భాస్కర్ !

(18వ పేజీ తరువాయి)



గాంధి శాంతి కేంద్రం హైదరాబాద్ వారి ఆర్థిక సహకారంతో, శోధన సంస్థ డైరెక్టర్ శ్రీ పి.డి.కామేశ్వరరావు గారు పర్యవేక్షణలో, పి.ఎం.కె.ఆధ్వర్యంలో విజయనగరం జిల్లాలో మహిళా సంఘాలను బలోపేతం చేయుట, బాలకార్మిక పాఠశాల నిర్వహణ, వన సంరక్షణ సమితుల ఏర్పాటులో తన వంతు సహాయ సహకారాలు అందజేశారు.

2000 సెప్టెంబర్ నుండి 2007 జనవరి వరకు విజయనగరం జిల్లాలో పేదరిక నిర్మూలన కార్యక్రమం (సెర్ప్, వెలుగు) సహాయ ప్రాజెక్ట్ అధికారిగా గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రణాళికలను రూపొందించడం, స్వయం సహాయక సంఘాలు, గ్రామ, మండల సమాఖ్యల ఏర్పాటు సూక్ష్మ ప్రణాళికలు తయారు చేయించి వారికి సామాజిక పెట్టుబడి నిధి అందేలా చూడడం, జిల్లా పేదరిక నిర్మూలన కార్యక్రమంలో పొందిన శిక్షణల స్ఫూర్తితో టి.టి.డి.సి.లో స్వయం సహాయసంఘ సభ్యులకు, సమాఖ్య ప్రతినిధులకు, గ్రామ స్థాయి సిబ్బందికి, వివిధ రకాలైన శిక్షణలు యిచ్చారు.

2007 జనవరి నుండి యిప్పటివరకు ఏపిమాస్‌లో వివిధ పేదరిక నిర్మూలన, పట్టణాభివృద్ధి కార్యక్రమాలను సమర్థంగా నిర్వహించి పలువురి ప్రశంసలను పొందారు.

2016 వరకు ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి.ఎస్.రెడ్డి గారి ఆధ్వర్యంలో పట్టణ పేదరిక నిర్మూలన కార్యక్రమం (మెప్మా) అనుసంధానంతో గుడివాడ పట్టణంలోని స్లమ్స్‌లో స్వయం సహాయ సంఘాలకు శిక్షణలు, స్లం సమాఖ్య ఏర్పాటు, పట్టణ సమాఖ్య ఏర్పాటు చేసి, అవి చట్టబద్ధత (1995 మ్యాక్స్ చట్టం) పొందేలా అవగాహన కల్పించి, అభివృద్ధి పథంలో ముందడుగువేయడానికి తోడ్పాటు అందించారు. ఈ పట్టణ స్లమ్స్‌లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టడంలో, మినరల్ వాటర్ ప్లాంట్ ద్వారా స్లమ్స్ వాసులలో సురక్షిత మంచి నీటి సదుపాయం పొందడంలో సహకరించారు.

**నెల్లూరు జిల్లాలో ఆదర్శ గ్రామాభివృద్ధి**

2016 ఏప్రిల్ నుండి ఇప్పటి వరకు గ్రామపంచాయితీ, ప్రభుత్వం, ఆరబిందో ఫార్మా లిమిటెడ్, ప్రవేశ ఇండస్ట్రీస్, ఏపిమాస్ సంస్థల సహకారంతో నెల్లూరు జిల్లాలోని పెయ్యల పాళెం, శ్రీరామపురం గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడంలో శ్రీ భాస్కర్ విశిష్ట సేవలను అందిస్తున్నారు.

ఈ గ్రామాలలోని మహిళా సంఘ సభ్యులకు పంచసూత్రాల పైన, పుస్తక నిర్వహణ పైన, ఆదాయాభివృద్ధి



కార్యకమాలపైన చిత్తూరు జిల్లా కమ్యూనిటి రిసోర్స్ పర్సన్స్‌తో అవగాహన కలిగించడం జరిగింది. టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైనెన్స్ (టి ఐ ఎస్ ఎస్) విద్యార్థులు ఈ గ్రామాన్ని సందర్శించి స్వయం సహాయసంఘాల సభ్యులు, రైతులు, యువకులు, పాలసేకరణ కేంద్రాల సభ్యులుతో వ్యవసాయం, ఆదాయాభివృద్ధి కార్యకమాలపై అధ్యయనం చేయడం విశేషం.

**నమ్మితే మౌనం కూడా చక్కగా అర్థమవుతుంది, నమ్మకం లేకుంటే ప్రతి మాట అపార్థంగానే వినిపిస్తుంది**

### ప్రాథమిక పాఠశాల అభివృద్ధి

ప్రాథమిక పాఠశాల సుమారు 2.5 ఎకరాల విస్తీర్ణంలో వున్నది. ప్రహరీ గోడ కూడా వుంది. అయితే, పాఠశాలలోకి ప్రవేశించే చోట ప్రహరీగోడ కొంత భాగం కూలిపోయింది, గేటు కూడా లేదు. ఇంతేకాకుండా ప్రహరీగోడ అక్కడక్కడా రంధ్రాలు పడి శిథిలమైంది. ఆ కారణంగా పాఠశాల లోకి పశువులు వెళ్లి పాడు చేస్తుండేవి. ఈ సమస్య నివారణకు ముందుగా గ్రామాభివృద్ధి కమిటీ (వి డి సి) సహకారంతో పాఠశాల ప్రహరీగోడను కొంతవరకు మరమ్మతు చేయించడం, ప్రవేశంలో ఇనుపగేటు, పాఠశాల బోర్డు ఏర్పాటు చేయించి, మల మూత్రవిసర్జన శాలలకు మరమ్మతులుచేయించి, నీటివసతి కల్పించడం జరిగింది.

విద్యార్థులకు పాఠశాలపై ఆసక్తి కలగడంకోసం, విద్యార్థుల, ప్రజల ఆలోచనలలో, ప్రవర్తనలో సానుకూలమైన మార్పు కోసం ప్రహరీ గోడ అంతటికీ రంగులు వేయించి, మంచి సూక్తులను, మహనీయుల చిత్రాలను వేయించారు. ఈ విధంగా పాఠశాల పట్ల ఆసక్తి కలిగించడంతో



నాడు 26గా వున్న విద్యార్థుల సంఖ్య 44 కు పెరిగింది.

అరబిందో ఫార్మా లిమిటెడ్, ప్రవేశ ఇండస్ట్రీస్ తోడ్పాటుతో పాఠశాల పునః ప్రారంభం రోజున విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు అందించడం ద్వారా వారిలో మరింత ఆసక్తిని ప్రేరేపించగలిగారు. పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగా అదనంగా పిల్లలకు ఆంగ్ల విద్యాబోధనకు గాను విద్యా వలంటీర్‌ను నియమింపజేసి, నాణ్యమైన విద్యను అందించడానికి కృషి చేశారు. ప్రైవేటు పాఠశాలల్లో మాదిరిగా జాతీయ పండుగలు , ఆటల పోటీలు నిర్వహించి మంచి బహుమతులు అందించి ప్రతిభ గల వారిని ప్రోత్సహించడం ద్వారా మెరుగైన విద్యను అందించడానికి శ్రీ భాస్కర్ ముమ్మరంగా కృషి చేస్తున్నారు.



### ఆరుబయట మలవిసర్జన రహిత గ్రామం

పెయ్యలపాళెం గ్రామాన్ని పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడంలో భాగంగా, ఆరుబయట మలవిసర్జన లేకుండా చేయుటకు గాను గ్రామస్తులందరికీ వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణంకోసం ప్రభుత్వం ఒక్కొక్క మరుగుదొడ్డికి మంజూరుచేసిన 15,000 రూపాయలు, అరబిందో ఫార్మా లిమిటెడ్ , ఏపిమాస్ సంస్థల సహకారంతో సమకూరిన 3,000 రూపాయలతో 138 వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టి పూర్తి చేయగలిగారు.

నిర్మాణాలు పూర్తయిన మరుగుదొడ్లను ఆ కుటుంబాలవారు వినియోగించుకునే అవగాహన కలిగించడంకోసం ఇంటింటికీ వెళ్ళి వారితో మాట్లాడుట, ప్రజల ఆలోచన, ప్రవర్తనలో మార్పు కోసం బృందంగా ఒక దగ్గర సమావేశ పరచి ప్రభుత్వ అధికారులు గ్రామపెద్దలు వి డి సి, స్కూల్ విద్యార్థులతో అవగాహన కలిగించడం, వ్యక్తిగత మరుగుదొడ్లు వాటి వినియోగంపై రోజూ ఉదయం, సాయంత్రం మైక్ ద్వారా ప్రజలను చైతన్యపరిచే వివిధ వినూత్న కార్యక్రమాలను చేపట్టారు. మైకు ప్రచారం కోసం స్థానిక వికలాంగ వ్యక్తిని గుర్తించి ఉపాధి అవకాశం కల్పించారు.

ఈ చర్యల ఫలితంగా పెయ్యలపాళెం గ్రామాన్ని ఆరుబయట మలవిసర్జన లేని గ్రామం (ఓ డి ఎఫ్) గా జిల్లా అధికారుల గుర్తింపు పొందింది. గ్రామ సర్పంచ్ శ్రీమతి పెనాక శారద గారు జిల్లా కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.

నీ శక్తి సామర్థ్యాలను అనుమానిస్తే బాధపడకూడదు, ఎందుకంటె బంగారం నాణ్యతను శంకిస్తారు కాని ఇనుమును కాదుగా!

**మహిళలకు కుట్టు శిక్షణ**

గ్రామ మహిళలకు అదనపు జీవనోపాధి కల్పించడం కోసం అరబిందో ఫార్మా ఫౌండేషన్, ప్రవేశ ఇండస్ట్రీస్, ఏపిమాస్ సంయుక్త ఆధ్వర్యంలో కుట్టు శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటుచేసి, ఉచితంగా కుట్టు శిక్షణకు అవకాశం కల్పించడంతో 42 మంది మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కుట్టు శిక్షణలో రాటు దేలుతున్నారు. శ్రీ రామాపురం గ్రామంలో 62మంది కుట్టు శిక్షణ పొందుతున్నారు. కేవలం 90 రోజుల శిక్షణతో అన్ని రకాల డిజైన్లు కుట్టేలా నేర్పిస్తున్నారు. కొంతమంది మహిళలు శిక్షణా కాలంలోనే దుస్తులు కుడుతూ అప్పుడే ఉపాధి పొందుతున్నారు. వీరికి శిక్షణ సక్రమంగా అందేలా, ఆసక్తిగా శిక్షణ పొందేలా చూడడంలో శ్రీ భాస్కరరావు ఎంతో శ్రద్ధ వహించారు.

**మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు**

గ్రామస్తుల కోరిక మేరకు గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్ (ఆర్ ఓ ప్లాంట్) ఏర్పాటుకు ఒక గదిని నిర్మింపజేసి, అందులో 1000 లీటర్ల స్థాయిగల నీటి శుద్ధి కేంద్రాన్ని 'ఎనీ టైం వాటర్ కార్డు'తో ఏర్పాటు చేయించడం మరో విశేషం. ఆర్ ఓ ప్లాంట్ ద్వారా గ్రామస్తులకు తక్కువ ధరకు సురక్షిత మంచినీరు అందించడంలో శ్రీ భాస్కర రావు కీలక పాత్ర పోషించారు.

**ఆదర్శ గ్రామాల సందర్శన**

ఆదర్శగ్రామానికి అవగాహన పర్యటనకుగాను గ్రామ వి డి సి సభ్యులను, యువకులను , మహిళా సంఘ సభ్యులను తూర్పు గోదావరి జిల్లాలోని బూరుగుపూడికి తీసుకు వెళ్ళి వారు ఆదర్శ గ్రామ తీరుతెన్నులను ఆకళింపుచేసుకోవడంలో సహకారం అందించారు. కరోనా వైరస్‌కు చికిత్స కంటే నివారణే ముఖ్యం అనే ఉద్దేశంతో శ్రీరామపురం, పెయ్యలపాళెం గ్రామాలలో చైతన్య సమావేశాలు నిర్వహించి అవగాహన కలిగించారు. పెయ్యలపాలెం గ్రామంలో 20 సోలార్ వీధి దీపాలను, శ్రీరామపురం, పెయ్యలపాలెం గ్రామాలలో 266 ఎల్.ఇ.డి. విద్యుత్ వీధిదీపాలను ఏర్పాటు చేయించడంలో ప్రత్యేక శ్రద్ధ వహించారు.

ప్రభుత్వం, అరబిందో ఫార్మా లిమిటెడ్, ప్రవేశ ఇండస్ట్రీస్, ఏపిమాస్ సంస్థల సహకారంతో సుమారు 1.40 కోట్లరూపాయల వ్యయంతో (ప్రభుత్వం70 లక్షలు, అరబిందో ఫార్మా లిమిటెడ్, ప్రవేశ ఇండస్ట్రీస్ కలసి 70 లక్షలు) గ్రామంలో సిమెంట్ రోడ్ల నిర్మాణాన్ని చేపట్టారు.



గ్రామంలో రోడ్డుకు ఇరు వైపులా మొక్కలు నాటించి, స్కూల్ ఆవరణలో మొక్కలు నాటించి, వాటికి ట్రీగార్డ్స్ అమర్చి పచ్చదనం-పరిశుభ్రత పెంపుదలకు దోహదం చేశారు. గ్రామంలోని శ్రీ సీతారామాలయంలో మంచి నీటి బావి రిపేరు చేపట్టారు. గ్రామంలో యువకులకు ఆటల పోటీలు నిర్వహణకు గాను క్రికెట్ కిట్ మరియు వాలీబాల్ కిట్‌ను సమకూర్చుట జరిగినది.

**ఎఫ్ పి ఓ ఏర్పాటు**

పెయ్యాలపాలెం గ్రామంలో 81 మంది రైతులతో రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్ పి ఓ) ఏర్పాటులో కీలకపాత్ర పోషించారు. సభ్య రైతులతో సమావేశం నిర్వహించి సొసైటీ నియమాలు, చేపట్టవలసిన కార్యక్రమాలపై అవగాహన కలిగించారు.

ఏపిమాస్ సంస్థ ద్వారా అహ్మదాబాద్‌లోని 'సేవ', సంస్థను, గుర్‌గావ్‌లోని ఎస్ ఆర్ ఎఫ్ ఫౌండేషన్‌ను, కామారెడ్డి స్వనియంత్రణ ఉద్యమ సంస్థను సందర్శించి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో స్వయం సహాయ సంఘాలను బలోపేతం చేయడానికి, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేశారు.

ఏపిమాస్ సి ఇ ఓ శ్రీ సి.ఎస్.రెడ్డి గారు తనను ఎంతగానో ప్రోత్సహిస్తూ, తన అభివృద్ధికి, గ్రామ, పట్టణ ప్రాంతాల అభివృద్ధికి నిరంతరం తోడ్పాటు అందిస్తున్నారంటూ శ్రీ భాస్కరరావు ఆయనకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ■

# అందరి కోసం ... అందరి ఇల్లు !

**అ**ది హైదరాబాద్‌లో దిల్‌షుక్‌నగర్‌కు, యల్.బి.నగర్‌కు మధ్య ఉన్న కొత్తపేటలోని లక్ష్మీనగర్ కాలనీ రెండవ వీధి. ఆ ఇంటి నెంబర్ 11-10-16. ఆ ఇంటికి ఒక ప్రత్యేత వుంది. ఏమిటంటే ఉదయం 5.30 నుండి రాత్రి 1.00 గంట వరకూ అది 'అందరి ఇల్లు' ! చిత్రంగా వుంది కదూ! ఆ విశేషాలు చూద్దాం.

గేట్లు తెరిచే ఉంటాయి. ఆకలేసిన వారు ఎవరైనా సరే లోపలికి వెళ్ళి భోజనం చేయవచ్చు. ఒకవేళ భోజనం సిద్ధంగా లేకపోతే వెళ్ళిన వాళ్ళు వండుకుని తినవచ్చు. గ్యాస్ స్టవ్, బియ్యం, ఉప్పు పప్పులూ, కూరగాయలు అన్నీ ఉంటాయి. డబ్బేమీ చెల్లించ వలసిన పనిలేదు. అంతా ఉచితం! మానవాళి సేవే పరమార్ధం!

ఆ ఇంటికి ఇంకో ప్రత్యేకత కూడా వుంది! కేవలం ఆకలేసిన వారే కాకుండా కాసేపు ప్రశాంతంగా కూర్చుని వెళ్దాం అనుకునే వారు కూడా వస్తుంటారు. అక్కడ ఎన్నో పుస్తకాలు కూడా ఉన్నాయి. విద్యార్ధులు, ఉద్యోగాలు వెతుక్కునే వారు అక్కడికి వెళ్తుంటారు. అక్కడే తిని అక్కడే చదువుకుని పిహెచ్‌డి చేసిన వారు కూడా ఉన్నారు.

ఇంత మంచి ఆలోచనని ఆచరణలో పెట్టిన వారు డాక్టర్ వింజమూరి సూర్యప్రకాష్, డాక్టర్ సామవేదం కామేశ్వరి దంపతులు. 'దిక్కులేని వాళ్లకు దేవుడే దిక్కు' అంటారు. కానీ అలాంటి వాళ్ల కోసమే మేమున్నామంటూ సమాజానికి సేవలందిస్తోంది ఈ ఆదర్శ జంట. ఆకలి తీర్చడం మొదలు... ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించడం వరకూ భిన్నమైన బాధ్యతలను భుజాన మోస్తున్న ఈ వైద్య జంట అలుపెరగని తమ సేవా ప్రయాణంలోని తమ అనుభవాలను, ఆలోచనలను 'నవ్య'తో పంచుకున్నారు! 'ఆంధ్రజ్యోతి' సౌజన్యంతో 'మహిళా సాధికారత' పాఠకులకోసం ఆ విశేషాలను అందిస్తున్నాం.




*'అందరి ఇల్లు' నిర్వాహకులు డాక్టర్ వింజమూరి సూర్యప్రకాష్, డాక్టర్ సామవేదం కామేశ్వరి దంపతులు.*

"నేను తినగలుగుతున్నాను. మరి నాలాగా సాటి వారందరికీ భోజనం దక్కుతోందా?' భోజనం చేస్తున్న ప్రతిసారీ మనసులో కలిగే ఆలోచనలివి. సమయానికి తిండి దొరకని వారి పరిస్థితి ఏమిటి? ఉండడానికి నీడ లేని వారికి ఎవరు దిక్కు? ఇలాంటి ఆలోచనలు ఇతరుల ఆకలి తీర్చే మార్గాన్వేషణకు పురిగొల్పాయి.

ప్రారంభంలో ఉచితంగా అరటిపండ్లు పంచడంతో మొదలైన మా ప్రయత్నం క్రమేపీ భోజనం పెట్టగలిగే స్థాయికి చేరుకుంది. ఎవరైనా వచ్చి అడిగేవరకెందుకు? వాళ్లంతట వాళ్లే వచ్చి, వండుకుని తినే వెసులుబాటు ఉంటే బాగుంటుంది కదా? అని అనిపించింది. అందుకోసం 2006 జూన్ 15న ఏర్పడిందే 'అందరి ఇల్లు'.

ఇక్కడకు ఎవరైనా, ఎప్పుడైనా రావచ్చు. ఎన్ని రోజులైనా ఉండవచ్చు. ఇక్కడ వంట వండుకోవడానికి అవసరమైన వస్తువులు, నీటి సౌకర్యాలు ఉంటాయి. 'అందరి ఇల్లు'ను నడిపించడానికి నెలకు సుమారు 30 నుంచి 50 వేల రూపాయల వరకూ ఖర్చవుతుంది. అయినా మాకు ఎప్పుడూ భారం అనిపించలేదు. ఇందుకు కారణం ఎంతోమంది

నిజాయితీ బాటలో నడవడంలో గొప్ప సౌకర్యం వుంది, ఆ దారిలో రద్దీ బాగా తక్కువ



అవసరార్థులకు 'అందరి ఇల్లు' ఆసరా కావడమే! ఆ ఇంటితో జీవితంలో మర్చిపోలేని అనుభవాలూ, జ్ఞాపకాలూ ముడిపడి ఉన్నాయి.

**విజ్ఞానాన్ని పంచే ఆనంద నిలయం**

ఆకలి తర్వాతి స్థానం విజ్ఞానానిది. ఆకలి తీర్చితే సరిపోదు. అంతో ఇంతో విజ్ఞానం కూడా అందించాలి. ఈ ఆలోచనతో పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడం కోసం, విజ్ఞానాన్ని పెంచడం కోసం 2011లో తెలంగాణాలో 9 రీడింగ్ ప్లేసెస్‌ను, లైబ్రరీలను ఏర్పాటు చేశాం. ఆ రీడింగ్ ప్లేసెస్ ఇప్పుడు 100కు చేరుకున్నాయి. 'ఆనంద నిలయం' మేము నెలకొల్పిన సెంట్రల్ లైబ్రరీ. ఇప్పటికీ ఒక అంశం మీద పట్టు కోసం కనీసం 20 మంది కలిసి వచ్చి అడిగితే, వాళ్లకు అవసరమైన సహాయం అందిస్తాం. ఇక రీడింగ్ ప్లేసెస్‌లో ప్రతి శనివారం సాయంత్రం ఐదు నుంచి ఆరు గంటల వరకూ గంట పాటు పుస్తకాలను చదివి వినిపించడం, ఆ పుస్తకం గురించిన చర్చ జరుగుతూ ఉంటుంది. ఇలా ఇప్పటివరకూ సుమారు వేల పుస్తకాలను ప్రజలకు పరిచయం చేయగలిగాం. కోవిడ్ సమయంలో కూడా ఆన్‌లైన్ ద్వారా రీడింగ్ కార్యక్రమాన్ని కొనసాగించాం. కొవిడ్ కారణంగా కార్యక్రమాలు నిలిపివేసిన 'ఆనంద నిలయం' తిరిగి 2021 జులై 18 నుంచి అందరికీ అందుబాటులోకి వస్తుంది.

**ఆకుకూరలే మేలు...**

90 శాతం మహిళల సమస్యలను ఆహారంతోనే నయం చేసే వీలుంది. ఆడపిల్లల్లో అంతో ఇంతో నెలసరి నొప్పి సహజం. అయితే పెయిన్ కిల్లర్స్‌తో పని లేకుండా ఆకుకూరలతోనే నొప్పిని తగ్గించుకునే వీలుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో 525 రకాల ఆకుకూరలు దొరుకుతున్నాయి. వీటిలో కొన్ని నెలసరి నొప్పిని తగ్గిస్తే, నెల మొత్తం తినగలిగితే ఒంటినొప్పులను అదుపులోకి తెచ్చే ఇంకొన్ని ఆకుకూరలూ ఉన్నాయి. అంతటి శక్తి ఆహారానికి ఉంది.

**నిజజీవిత కథలెన్నో... వింజమూరి సూర్యప్రకాష్**

ఓరోజు ఒక మధ్య వయస్కురాలు ఎంతో నీరసంతో 'అందరి ఇల్లు'కు చేరుకుంది. ఆకలి తీరిన తర్వాత 'నా కొడుకును కూడా తీసుకురావచ్చా?' అని అడిగింది. ఆ బాబు ఆమె కంటే ఎక్కువగా నీరసించి ఉన్నాడు. భోజనం చేసి రెండు రోజులైందని వాళ్ల మాటల ద్వారా తెలిసింది. ఆ మాటలతో మనసు ద్రవించుకుపోయింది. వాళ్లు ఆ పరిస్థితి చూసి ఎందుకొచ్చారు? ఎక్కడివారు? అనే ప్రశ్నలేవీ తట్టలేదు. అవసరానికి 'అందరి ఇల్లు' ఉపయోగపడిందనే తృప్తి కలిగింది. అలా కొన్ని రోజులు గడిచాయి. ఆ తర్వాత ఆ తల్లీబిడ్డా అక్కడినుంచి వెళ్లిపోయారు. కొంత కాలం తర్వాత అదే కుర్రాడు స్కూటరు మీద వెళ్తూ ఆగి, 'గుర్తుపట్టారా అంకుల్' అని పలకరించాడు. టైల్స్ పరిచే పని చేస్తున్నాననీ, తమ కుటుంబ ఆర్థిక పరిస్థితి క్రమేపీ మెరుగైందనీ, ఆపత్కాలంలో తమకు ఆసరా అందించిన 'అందరి ఇల్లు'కు తనకు తోచిన సహాయం చేయగలననీ అన్నాడు. వాళ్లది బాగా బతికిన కుటుంబమనీ, ఓ ప్రమాదంలో తన ఆరోగ్యం దెబ్బతిని, 80 లక్షలు ఖర్చు పెట్టడంతో కుటుంబం రోడ్డున పడిందనీ, ఆ సమయంలో

నీవంటె ఇష్టపడడం వేరు, గౌరవించడం వేరు; ఇష్టపడే వారెందరో, గౌరవించే వారు కొందరే, గౌరవం పొందడమే గొప్పతనం

'అందరి ఇల్లు' గురించి తెలిసి, అక్కడికి వచ్చి తల దాచుకున్నామనీ ఆ కుర్రాడు చెప్పుకొచ్చాడు. ఇలాంటి నిజజీవిత కథలెన్నో ఆ ఇంటితో ముడిపడి ఉన్నాయి.

**మహిళలు మేల్కోవాలి ... సామవేదం కామేశ్వరి**

మహిళలు తమ శరీరం విలువను గ్రహించాలి. శరీరంలో నిరర్థకమైన అవయవం ఏదీ ఉండదు. అయితే స్వల్ప అసౌకర్యానికి విసుగు చెంది, గర్భసంచిని తొలగించుకునే (హిస్టక్టమీ) మహిళల సంఖ్య పెరుగుతోంది.

అమెరికా, ఆస్ట్రేలియాలలో వెయ్యి మంది మహిళల్లో కేవలం ఇద్దరు, ముగ్గురికే హిస్టక్టమీలు జరుగుతూ ఉంటే, మన దగ్గర ప్రతి వంద మంది మహిళల్లో 9 నుంచి 15 వరకూ, కొన్ని ప్రాంతాల్లో 30 వరకూ హిస్టక్టమీలు జరుగుతున్నాయి. అలాగే సహజసిద్ధంగా గర్భం దాల్చే అవకాశాలు ఉన్నా, ఐ.వి.ఎఫ్ లాంటి వైద్య ప్రక్రియలను ఆశ్రయించేవారి సంఖ్య కూడా పెరుగుతోంది.

గర్భం దాల్చే అవకాశాలు సన్నగిల్ల డానికీ, గర్భసంచీ తొలగించే సర్జరీలను ఆశ్రయించడానికీ ప్రధాన కారణం ఆ అంశాల పట్ల మహిళలకు అవగాహన లేకపోవడమే! ఇందుకోసం ఒక వైద్యురాలిగా, సాటి మహిళగా అవగాహనా కార్యక్రమాల ద్వారా మహిళల్లో చైతన్యం తీసుకురాగలిగాను. ఇందుకోసం ఉద్యమాలు చేపట్టాను. 'గర్భసంచీని కాపాడుకుందాం – సమాజాన్ని బలపరుచుకుందాం' అనే పేరుతో పుస్తకం కూడా రాశాను.

**అవగాహన అవసరం**

తొలి నెలసరి మొదలైన ఆడపిల్లలు మొదలు మెనోపాజ్‌కు చేరుకునే వయసు వరకూ మహిళలే నా లక్ష్యం. మహిళల జీవితకాలంలో ఈ సమయం ఎంతో కీలకం. తీసుకునే ఆహారం, ఆచరించే అలవాట్లు, అనుసరించే జీవనశైలి... ఇలా మహిళల ఆరోగ్యం ఎన్నో అంశాల మీద ఆధారపడి ఉంటుంది. సమస్య తలెత్తితే మూల కారణాన్ని కనిపెట్టి సరిదిద్దుకుని ఆరోగ్యాన్ని గాడిన పెట్టుకునే తత్వం కూడా మహిళల్లో కొరవడుతోంది.

అందుకే మహిళలకు సంబంధించిన ఎలాంటి అనుమానాలనైనా, ఎటువంటి అపోహలనైనా నివృత్తి చేసి, వాళ్లలో అవగాహన నింపడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. అందుకోసం నిరంతరంగా అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేస్తూ ఉంటాను. నెలసరిలో పాటించవలసిన పరిశుభ్రత, నొప్పి తగ్గించే మార్గాలు, సహజసిద్ధ గర్భధారణ, ప్రసవం, బాలింతల ఆరోగ్యం, గర్భసంచి ప్రాముఖ్యం, తొలగిస్తే కలిగే దీర్ఘకాల నష్టం మెనోపాజ్ మేనేజ్‌మెంట్... ఇలా జీవితంలోని వివిధ దశల్లో తలెత్తే ఏ సమస్యనైనా మహిళలు చాకచక్యంగా, ఆరోగ్యకరమైన పద్ధతిలో ఎలా పరిష్కరించుకోవచ్చో నేర్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నాను. ఈ ప్రయాణం నిరంతరం కొనసాగిస్తాను.

(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)

■

## గుండెకు మేలుచేసే పచ్చి మిరప !

పచ్చి మిరపకాయలు తినాలంటే కొందరికి భయం. మరికొందరేమో హాయిగా నమిలేస్తుంటారు. ఇంతకూ మిర్చి మంచిదా? దానివల్ల ఏమైనా సమస్యలు ఉన్నాయా?.. వంటి అంశాలపై అమెరికాకు చెందిన ఓ సంస్థ అధ్యయనం చేసింది. పచ్చి మిరపకాయలల్లో ఉండే 'క్యాప్సైసిన్'లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయని పరిశోధకులు అంటున్నారు. వీటివల్ల ఆరోగ్యానికి మేలే అని చెప్తున్నారు. ఓహియోకు చెందిన 'ది క్లీవ్‌లాండ్ క్లినిక్' ఆధ్వర్యంలో ఈ అధ్యయనం జరిగింది. పచ్చి మిర్చి తినడం వల్ల హృదయ సంబంధిత వ్యాధులు దగ్గరికి కూడా రావనీ, క్యాన్సర్ మరణాల ముప్పు కూడా తగ్గుతుందనీ నిపుణులు అంటున్నారు. ఈ అధ్యయనంలో భాగంగా ఇరాన్, చైనా, ఇటలీ, అమెరికా తదితర దేశాల ప్రజలను పరిశీలించారు. మిర్చిలో ఉండే క్యాప్సైసిన్‌లోని యాంటీ యాక్సిడెంట్ గుణాలు ఇన్‌ఫ్లమేషన్‌ను అడ్డుకోవడమే కాకుండా రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను పెరగనివ్వదని తెలిపారు. మధుమేహం, ఊబకాయం సమస్యలు ఉన్నవారికి మిర్చి చాలామంచిది అని వారు పేర్కొన్నారు. ■

ఆత్మీయంగా వుండడం సులభమే, ఆత్మీయతను పొందడమే కష్టం; అందుకే ఆత్మీయులను ఎన్నడూ దూరం చేసుకోకూడదు

# పత్తి కట్టె కాల్చకండి ...లాభం పొందండి!

రైతులు అత్యధికంగా పండించే పంటల్లో పత్తి ఒకటి. వేలాది ఎకరాల్లో పత్తి పంటను సాగు చేస్తున్నారు. పత్తిని సేకరించడం పూర్తైన అనంతరం రైతులు ఎండిన మొక్కలను తొలగించి కాల్చేయడమో, భూమిలో కలియ దున్నేయడమో చేస్తుంటారు. కానీ పత్తి కట్టెతోనూ బోలెడు లాభాలున్నాయి. పక్క రాష్ట్రాల్లో రైతులు పత్తి కట్టెను అమ్మడం ద్వారా అదనపు ఆదాయం పొందుతున్నారు.

రైతులు పత్తి విత్తనాలను వానాకాలంలో నాటుకుంటారు. ఆరు నెలల అనంతరం పత్తిని సేకరించడం పూర్తవుతుంది. పంట తీసుకున్న అనంతరం మొక్కలు ఎండిపోతాయి. సాధారణంగా రైతులు వీటిని గుంటుకుతో తొలగించి కుప్పలుగా పోసి కాల్చేస్తుంటారు. మరికొందరు రైతులు ట్రాక్టర్లతో భూమిలో కలియ దున్నేస్తుంటారు. కొందరు వంట చెరుకుగా వినియోగిస్తుంటారు.

పంట చేనులో పత్తి కట్టెను తగులబెట్టడంతో భూములు సారం దెబ్బతింటుంది. భూమిలో ఉండే మిత్ర పురుగులు, సూక్ష్మజీవులకు హాని కలుగుతుంది. అంతేకాకుండా కట్టెను కాల్చే సమయంలో వచ్చే పొగ కారణంగా పర్యావరణానికి ముప్పు కలుగుతున్నది. అలాగే భూమిలో కలియదున్నడంతో చీడపీడలు చేనులోనే ఆశ్రయం పొందుతుంటాయి. కానీ పక్క రాష్ట్రాల్లో మాత్రం పత్తి కట్టెను ప్యాకింగ్ మెటీరియల్, సేంద్రియ ఎరువుల తయారీలో వినియోగిస్తున్నారు. దీని ద్వారా రైతులకు శ్రమ తగ్గడమే కాకుండా అదనపు ఆదాయం కూడా సమకూరుతుంది.

**అవగాహనతో రైతుకు లాభం**

పొరుగునే ఉన్న మహారాష్ట్రలో ఎండిన పత్తి కట్టెతో పార్టికల్ బోర్డులు, హార్డ్ బోర్డులు, కర్రుగేటెడ్ బోర్డులు, బాక్సులు, పేపర్ పల్ప్, ప్యాకింగ్ బాక్సులు ప్లైవుడ్ తయారు చేస్తున్నారు. తినదగిన పుట్టగొడుగుల పెంపులో మైక్రో క్రిస్టలిన్ సెల్యులోజ్ కోసం కూడా పత్తికర్రను వినియోగిస్తున్నారు. ఫ్యాక్టరీల యజమానులు తొలగించిన పత్తికట్టెను టన్నుకు రూ. 300 నుంచి రూ.400 వరకు చెల్లించి కొనుగోలు చేస్తున్నారు. సాధారణంగా హెక్టారు పత్తి చేనులో 4టన్నుల పత్తి కర్ర లభ్యమవుతుందని అంచనా.

ఒక పత్తి కర్రలో 68 శాతం హెూలో సెల్యులోజ్ 26 శాతం లిగ్నిన్ 7 శాతం బూడిద లభ్యమవుతుందని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన కేంద్ర పత్తి సాంకేతిక పరిశోధన సంస్థ (సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ రీసెర్చ్ ఆన్ కాటన్ టెక్నాలజీ (సిర్‌కాట్ సీఐఆర్‌సీఈవోటీ) లెక్క కట్టింది. ఈ లెక్కన కట్టె అమ్మకం ద్వారా ప్రతీ రైతుకు హెక్టారుకు రూ. 1200 నుంచి 1600 ఆదాయం సమకూరుతుంది.

**పత్తి కట్టెతో ఉపయోగాలు**

ఎండి పత్తి కట్టెను పొడి చేసి వర్మీ కంపోస్ట్ తయారీలో వినియోగించవచ్చు. పశువులకు దాణాగా కూడా వాడవచ్చు. పొడి చేసి చేనులో చల్లితే బయోమార్చ్‌గా మారి తేమను నిలిపిఉంచే సామర్థ్యం పెరుగుతుంది. కలుపు మొక్కలు పెరుగకుండా కూడా అరికడుతుంది. పత్తికట్టెతో పిడకలు తయారుచేసి ఫ్యాక్టరీల్లో, బాయిలర్లలో బొగ్గుకు బదులుగా వాడవచ్చు. ప్యాకింగ్ మెటీరియల్ తయారీలో ప్లైవుడ్ తయారీ, పేపర్ తయారీలోనూ పత్తికర్రలను వాడవచ్చు. పుట్టగొడుగుల సాగులో ఎరువుగానూ వాడుతుంటారు.

**ఫ్యాక్టరీలతో ఉపాధికి ఊతం**

మన ప్రాంతంలో పత్తిని సేకరించిన అనంతరం మొక్కలను తొలగించడానికి రైతులు ఎకరాకు రూ. 600 ఖర్చు చేస్తున్నారు. అసలే వాతావరణ ప్రభావంతో దిగుబడి సరిగ్గా రాక.. పెట్టుబడి ఖర్చులు పెరిగిపోయి అప్పుల్లో కూరుకుపోతున్న రైతులకు ఇది అదనపు భారంగా పరిణమిస్తోంది. ఈ నేపథ్యంలో పత్తికట్టెను సద్వినియోగం చేసుకునే పరిశ్రమల ఏర్పాటుకు యువతకు చేయూతనిస్తే రైతులకు లబ్ధి చేకూరుతుంది.

– ఆంధ్రజ్యోతి సౌజన్యంతో

■

గౌరవం రెండు విధాలుగా వస్తుంది ; అధికారంతో లేదా ప్రవర్తనతో ; మొదటిది తాత్కాలికం, రెండవది శాశ్వతం!

# శీతాకాలంలో పశువులకు నిల్వ నీరివ్వవద్దు

**తి**రుపతిలోని పశువైద్య శాస్త్ర కళాశాలలో లైవ్‌స్టాక్ ఫామ్ కాంప్లెక్స్ విభాగం అధిపతి, ప్రొఫెసర్ డాక్టర్ ఎంవిఎయస్. సూర్య నారాయణగారు శీతాకాలంలో పశు సంరక్షణలో తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఒక వ్యాసంలో వివరించారు. వారి సౌజన్యంతో 'మహిళా సాధికారత' పాఠకులకు ఆ వివరాలను అందిస్తున్నాం. ఏవైనా సలహాలు, సూచనలకోసం డాక్టర్ ఎంవిఎయస్. సూర్య నారాయణ గారిని సంప్రతించవలసిన ఫోన్ నంబర్: 99485 90506.

వేసవిలోలాగానే, శీతాకాలంలో కూడా పశువులు కొంత ఇబ్బందికర వాతావరణాన్ని ఎదుర్కొంటాయి. సాధారణంగా పశువులు తమ శరీర ఉష్ణోగ్రతను 101 డిగ్రీల ఫారెన్ హీట్‌గా సరి చేసుకుంటూ జీర్ణప్రక్రియను కొనసాగిస్తూ ఉంటాయి. మెటబాలిజమ్ ద్వారా ఉత్పత్తి అయ్యే వేడిని వేసవిలో చెమటద్వారా, శీతాకాలంలో మూత్రం ద్వారా బయటకు పంపుతాయి. ఈ వేడిని బయటకు పంపే ప్రక్రియ పశువు పరిసర వాతావరణాన్ని బట్టి ఉంటుంది.

వేసవిలో ఎక్కువ వేడి శరీరంలో ఉన్న పక్షంలో వడదెబ్బ తగలడం, అలానే శరీరంలో శీతాకాలంలో సరియైన వేడి శరీరంలో లేనప్పుడు పశువు శీతలపు ఒత్తిడిని చవిచూస్తుంది. దీనినే 'కోల్డ్ స్ట్రెస్' అంటారు. దీని నివారణకు కొన్ని సూచనలు:

1. బాగా చల్లగా ఉన్న నీటిని పశువులకు అందించరాదు. దీనికి నివారణగా నిల్వ ఉన్న వాటిని కాకుండా, తాజా బోర్‌వెల్ నుంచి వచ్చిన నీటిని పశువులకు అందించాలి. నిల్వ నీరు ఎక్కువ చల్లగా ఉంటుంది.
2. బయట వాతావరణం చల్లగా ఉంటే, ఎక్కువ వేడి శరీరం నుంచి బయటకు పశువు వదులుకోవాల్సి వస్తుంది. అందుచేత ఎక్కువగా వేడిని ఉత్పత్తి చేసే మేపు పదార్థాలను పశువులకు అందించాలి. ఎండుమేత వంటి వాటిని పశువుకు ఎక్కువగా అందించాలి. దాణా పదార్థాలకంటే ఇవి మేలు.
3. పశువుల షెడ్లకు ఉన్న అన్ని ద్వారాలు మూయకూడదు. గాలి, వెలుతురు తగ్గిపోయి, షెడ్లలో తేమ వాతావరణం ఏర్పడుతుంది.
4. చల్లగాలుల నుంచి పశువులను కాపాడాలి. షెడ్లలో సూర్యరశ్మి పడేటట్లు చూడాలి.
5. వీలయితే పశువులకు వరిగడ్డితో వెచ్చదనం కోసం ఒక బెడ్డును ఏర్పాటు చేయాలి. వీటిని పొడిగా ఉంచడం అవసరం.
6. సాధ్యమయినంత వరకు పశువులకు గోరువెచ్చటి నీటిని అందించగలిగితే మంచిది. శీతాకాలంలో నీటిని పశువు తక్కువగా తాగినట్లయితే, మేత ద్వారా లభ్యమయ్యే ఘన పదార్థాన్ని తక్కువగా మేయడం, తద్వారా పాల దిగుబడి తగ్గిపోవడం జరుగుతుంది.



7. వయస్సు మళ్లిన పశువులు, దూడలు, వ్యాధి బారిన పడిన పశువులు ఎక్కువగా ఈ కోల్డ్ స్ట్రెస్ బారిన పడుతుంటాయి. వీటిని జాగ్రత్తగా గమనించవలసి ఉంటుంది.
8. పాలు తీసిన తర్వాత పశువుల చనులను శుభ్రంగా తుడిచి, ఆరబెట్టి మందలోకి వదలాలి. లేకపోతే 'ఫ్రాస్ట్ బైట్' అనే పరిస్థితి ఏర్పడుతుంది. ఇలా శీతాకాలంలో కొన్ని సూచనలు పాటించవలసిన అవసరముంది.

■

స్నేహ గుణం ఎంతగా నీ బలహీనత అయితే అంతగా నిన్ను మించిన బలశాలి వుండడు

# పశువులకు వచ్చే వ్యాధులు, వాటికి చికిత్సలు

**పా**డి పశువులకు వచ్చే కొన్ని సాధారణ వ్యాధులకు అందించవలసిన చికిత్సలను గురించి ఈ వ్యాసం వివరిస్తుంది.

**పొదుగువాపు వ్యాధి**

**కావలసిన పదార్థాలు :** కలబంద – 250 గ్రా, పసుపు – 50 గ్రా, సున్నం – 15 గ్రా

**తయారుచేయు విధానం :** ఈ మూడు పదార్ధములను గ్రైండర్‌లో వేసి, కలిపి, ఎర్రటి పాకం తయారు చేసుకోవాలి. ఈ పాకం (పేస్టు) ఒకరోజుకి సరిపోతుంది. ఏరోజుకారోజు తాజాగా తయారు చేసుకోవాలి.

**వాడు విధానం :** పరిశుభ్రమైన నీటితో పొదుగును బాగా రుద్ది కడగాలి. అన్ని చన్నుల నుండి పాలను పూర్తిగా పితకాలి. చేతి నిండుగా పేస్టు తీసుకుని దానికి 150–200





మి.లీ. నీరు కలపాలి. ఈ మిశ్రమాన్ని పొదుగంతా పూర్తిగా రాయాలి. ఇలా రోజుకి 10 సార్లు చొప్పున 5 రోజులు రాయాలి. ప్రతిరోజు ఆఖరి మోతాదుగా మంచినూనె (250 మి.లీ.) లో 10 గ్రా. పసుపు, 10 రెబ్బలు వెల్లుల్లి, గుప్పెడు తులసి ఆకులతో చేసిన పేస్టుల మిశ్రమాన్ని కలిపి, వేడి చేసి చల్లార్చాలి. చల్లార్చిన మిశ్రమాన్ని శుభ్రపరచబడిన పొదుగుకు రాయాలి.

పాలలో రక్తము / పాలు రంగు మారిన సందర్భాలలో రెండు నిమ్మకాలయను బద్దలుగా కోసి పశువు నోటి దవడలో ఉంచాలి. ఈవిధంగా రోజుకి 3 సార్లు చొప్పున 4 రోజులు పెట్టాలి. (పశువు నిమ్మ చెక్కలను చప్పరించడం వలన సిట్రిక్ యాసిడ్ ఉత్పత్తి అవుతుంది)

**పొదుగుకు నీరు దిగుట**

**కావలసిన పదార్థాలు:** నువ్వుల నూనె / మంచినూనె – 200 మి.లీ., పసుపు – చేతి నిండా, వెల్లుల్లి – 2 పాయలు

**తయారుచేయు విధానం :** నూనెను వెచ్చబెట్టి దానిలో పసుపు మరియు వెల్లుల్లి తురుము కలపాలి. బాగా కలిపి వెచ్చబెట్టాలి. మరగబెట్టకూడదు. ఆరనివ్వాలి.

**వాడు విధానం :** నీరు దిగి వాపు కనబడిన ప్రాంతం మీద మొత్తం పొదుగు మీద బలంగా ఈ మిశ్రమాన్ని రాయాలి. రోజుకి 4 సార్లు చొప్పున 3 రోజులు రాయాలి.

గమనిక : ఈ మందు రాసే ముందు అది పొదుగువాపు కాదని నిర్ధారించుకోవాలి.

**వట్టిపోయిన పశువుకు పొదుగువాపు నిరోధక చికిత్స**

**కావలసిన పదార్థాలు:** కలబంద – 250 గ్రా , పసుపు – 50 గ్రా, సున్నం – 10 గ్రా

**వాడు విధానం :** పొదుగు వాపు వ్యాధి చికిత్సలో వలెనే మిశ్రమాన్ని తయారుచేసి ఒక గ్లాసు నీళ్ళతో కలిపి (100–200 మి.లీ.) పొదుగుకు అన్నివైపులా రాయాలి. ఈవిధంగా రోజుకి 2సార్లు చొప్పున చూడి చివరి దశ అనగా ఈనే ముందు 45రోజులు రాయాలి. అధమ పక్షం వారానికి కనీసం రెండు లేక మూడుసార్లు చొప్పున రాయాలి.

**చన్ను రంధ్రంలో అవరోధం**

**కావలసిన పదార్థాలు:** అప్పుడే తుంచిన, శుభ్రం చేసిన తాజా వేప ఆకు ఈనె, పసుపు, వెన్న లేదా నెయ్యి

**తయారుచేయు విధానం :** చనున పొదుగును బట్టి ఈనె పొడుగును కత్తిరించుకోవాలి. వెన్న, పసుపు కలిపిన మిశ్రమాన్ని వేప ఆకు ఈనెకు బాగా పట్టించాలి.

**వాడు విధానం:** వేపాకుఈనెకు వెన్న,పసుపు కలిపిన మిశ్ర మాన్ని పూయాలి. అప్పుడా వేపాకుఈనెను మూసుకుపోయిన చన్ను రంధ్రంలోనికి మెల్లగా దూర్చాలి. పాలు పితికిన ప్రతిసారి తాజా ఈనెను చను రంధ్రంలోనికి ప్రవేశపెట్టాలి. ■

చెడ్డ వ్యక్తుల దుర్మార్గాల కంటె మంచి వ్యక్తుల మౌనమే అత్యంత ప్రమాదకరం

# త్వరగా ఉన్నత స్థాయికి చేర్చే ఉపాధి మార్గాలు!

కెరీర్‌లో సాధ్యమైనంత వేగంగా ఎదగాలని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రతి ఒక్కరికీ ఉంటుంది. అయితే ఈ ఎదుగుదల వేగం అన్ని రంగాల్లోనూ ఒకేలా ఉండకపోవచ్చు. కొన్ని రంగాల్లో కెరీర్ నత్తనడకన సాగుతూ ఉంటే మరికొన్నింటిలో ఆకాశమే హద్దుగా అవకాశాలు ఉంటాయి. చేయాల్సిందల్లా వాటిని మీ రెండు చేతులతో అందిపుచ్చుకోవడమే. మార్కెట్‌లో అత్యంత వేగవంతమైన కెరీర్స్‌లో కొన్ని ఇవిగో...

**ఈవెంట్ మేనేజర్**

గ్లోబలైజేషన్ ప్రభావంతో భారత్ విశ్వవేదికగా ఎదుగుతోంది. ఎన్నో ప్రముఖ కంపెనీల సమావేశాలు, బిజినెస్ కాన్ఫరెన్స్‌లతో పాటు అనేక ఈవెంట్స్ ప్రతి నిత్యం వేల సంఖ్యలో దేశం నలుమూలలా జరుగుతూనే ఉంటాయి. వీటి నిర్వహణ కోసం ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీలను కూడా అదే స్థాయిలో ప్రారంభిస్తున్నారు.

కమ్యూనికేషన్స్, హాస్పిటాలిటీ, పబ్లిక్ రిలేషన్స్ వంటి అంశాల్లో డిగ్రీ పూర్తి చేసినవారు ఈ రంగంలో బాగా రాణిస్తారు. చొరవ, ఆకట్టుకునేలా మాట్లాడే గుణం, నిర్ణయాలు తీసుకోవడంలో వేగం మొదలైన లక్షణాలు ఉన్నవారికి ఈ రంగంలో ఎదుగుదల బాగుంటుంది.

వీరు ఏడాదికి రూ. 1,80,000 వేతనంతో ప్రారంభించి నైపుణ్యాన్ని బట్టి రూ. 8,00,000 వరకూ ఆర్జించే అవకాశం ఉంది.

**అనలిటిక్స్ ప్రొఫెషనల్**

హెల్త్ కేర్, బ్యాంకింగ్, ఈ–కామర్స్, మార్కెటింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, బయో టెక్నాలజీ ఇలా అన్ని రంగాల్లోను వచ్చే మార్పులను అధ్యయనం చేసి విశ్లేషణ చేయడం వీరి విధి. ఏదైనా బిజినెస్ ప్రారంభించడానికి ముందు నుంచే ఈ విశ్లేషకుల ఆవసరం ఉంటుంది.

బిజినెస్‌లో ఎదురయ్యే పోటీని తట్టుకొని నిలబడాలంటే ఎప్పటికప్పుడు వ్యాపార వ్యూహాలు, సంస్థాగత నిర్మాణాన్ని గురించిన విశ్లేషణలు అవసరమవుతాయి. ఈ కారణంగానే అనలిటిక్స్ ప్రొఫెషనల్స్‌కు డిమాండ్ పెరుగుతోంది. బిజినెస్ ఫైనాన్స్‌లో మాస్టర్స్ లేదా బ్యాచిలర్ డిగ్రీ వీరికి కావాల్సిన అర్హత. వీరు ఏడాదికి రూ. 2,10,000 వేతనంతో ప్రారంభించి నైపుణ్యాన్ని బట్టి రూ. 9,80,000 వరకూ ఆర్జించే అవకాశం ఉంది.

**ఆర్ & డి ప్రొఫెషనల్స్**

దేశంలో వేగంగా ఎదుగుతున్న రంగాల్లో రీసెర్చ్ అండ్ డెవల్‌పమెంట్ ఒకటి. ఏదైనా విభాగంలో ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేసినవారు పరిశోధన, అభివృద్ధి నిపుణులుగా రాణిస్తారు. వీరు తమ పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఇంజనీర్లు, సైంటిస్టులకు నూతన ఆవిష్కరణల విషయంలో తగిన సహాయం అందించాల్సి ఉంటుంది.

కంపెనీలు తయారు చేసిన నూతన ఉత్పత్తులను పరీక్షించి వాటిపై ప్రయోగాలు నిర్వహించాలి. అవి కంపెనీకి లాభదాయకంగా ఉంటాయో, లేదో విశ్లేషణ చేయాలి. వీరు ఏడాదికి రూ. 3,00,000 వేతనంతో ప్రారంభించి రూ. 30,00,000 వరకూ ఆర్జించే అవకాశం ఉంది.

**ఇంటీరియర్ డిజైనర్**

నివసించే ఇంటిని, పనిచేసే ఆఫీసును ఆహ్లాదంగా తీర్చిదిద్దడానికి నేడు అందరూ ప్రాధాన్యం ఇస్తున్నారు. దీనికోసం ఇంటీరియర్ డిజైనర్లను ఆశ్రయిస్తున్నారు కూడా. గతంలో ఈ పనులను ఇంటి కాంట్రాక్టరే పూర్తిచేసేవాడు. కాలానుగుణంగా వచ్చిన మార్పులతో ఇంటీరియర్ డిజైనర్లకు డిమాండ్ పెరిగింది. ఈ రంగంలో డిగ్రీ పూర్తి చేసినవారు ఏదైనా ఏజెన్సీలో చేరవచ్చు . ఫ్రీలాన్స్ ఇంటీరియర్ డిజైనర్‌గా కూడా పని చేయొచ్చు. వీరు ఏడాదికి రూ. 1,80,000 వేతనంతో ప్రారంభించి నైపుణ్యాన్ని బట్టి రూ. 6,00,000 వరకూ పొందే అవకాశం ఉంది. ■

మెచ్చుకునేవారి కంటె విమర్శించే వారి వల్లనే ఎక్కువ మేలు జరుగుతుంది, సామర్థ్యం పెంచుకోవడానికి వారే మూలం

# పేద విద్యార్థులకు అండగా సరోజినీ దామోదర్ ఫౌండేషన్

**ఆ**మెకు ఆకలి బాధ తెలుసు. ఆర్థిక సమస్యలూ తెలుసు. అన్నీ అనుభవించింది. అందలాన్ని అందుకున్న తర్వాత తన ఆనందం మాత్రమే కోరుకోలేదు. భర్త సహకారంతో సేవా సంస్థను ప్రారంభించింది. నిరుపేదలకు విద్యాదానం చేస్తున్నది. వారు కోరుకున్న భవిష్యత్తును కానుకగా ఇస్తున్నది. ఆవిడే కుమారి శిబూలాల్. ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుల్లో ఒకరైన ఎస్.డి.శిబూలాల్ జీవిత భాగస్వామి.



ముంబయి నగరంలో భర్త ఎస్‌డి శిబూలాల్‌తో కలిసి అడుగుపెట్టింది కుమారి. కేరళలో మారుమూల పల్లె రామమంగళం తన స్వగ్రామం. తండ్రి రైతు. తల్లి వ్యవసాయ పనులు చేసేది. ఊరికి సమీపంలోని పాఠశాలలో పీయూసీ వరకు చదివింది. తర్వాత కొచ్చిన్‌లో కేరళ యూనివర్సిటీలో బీఎస్సీ ఫిజిక్స్ చేసింది. అక్కడే శిబూలాల్‌తో పరిచయమైంది. అది పరిణయానికి దారి తీసింది. పెండ్లయ్యాక భర్తతో కలిసి ముంబయి నగరానికి చేరుకుంది. ఆయన సంకల్పం పెద్దది. లక్ష్యం ఉన్నతమైంది. 'నా ప్రయాణంలో తోడుగా ఉంటావా?' అని శ్రీమతిని అడిగాడు. అందుకు ఆమె మనస్ఫూర్తిగా సరేనంది.

అనుకున్నంత తేలిగ్గా సాగలేదా ప్రయాణం. తన భర్త ఓ మహాయజ్ఞం చేస్తున్నాడని ఆమెకు తెలుసు. అందులో విజయం సాధిస్తే తమదే కాదు, దేశ భవిష్యత్తే మారి పోతుందనీ తెలుసు. అందుకే శ్రీవారికి పూర్తిగా సహకరించాలని గట్టిగా నిశ్చయించుకుంది. కాలేజీ రోజుల్లోనే ఆయన పరిచయం. ఆయన ఆశయాలు, కష్టపడే తత్త్వం అన్నిటి మీదా పూర్తి అవగాహన ఉంది కుమారికి. అందుకే, ఆయన అడిగిందే తడవుగా ఒంటిమీదున్న నగలన్నీ తీసి ఇచ్చేసింది. మరో సందర్భంలో డబ్బు అవసరం అంటే మెడలోని మంగళసూత్రాన్నీ తీసి ఇచ్చేసింది. ఆనాడు అంతలా కష్టపడి వారు సాధించిన అద్భుతం ఏంటో తెలుసా! ఇన్ఫోసిస్ సంస్థ. అవును, ఇన్ఫోసిస్ నారాయణమూర్తి ఏడుగురు మిత్రబృందంలో శిబూలాల్ ఒకరు. ఆ సంస్థకు సీఈవోగా, ఎమ్‌డిగానూ సేవలు అందించారాయన.

**అమ్మ చూపిన బాట**

ఆ మిత్రుల కష్టానికి ఫలితం దక్కింది. ఇన్ఫోసిస్ కుదురుకుంది. అయినా వీరి ప్రయాణం ఆగలేదు. ఇండియా నుంచి అమెరికాకు, అక్కడి నుంచి ఇండియాకు.. తరచూ ప్రయాణాలే! అప్పుడూ భర్తకు తోడుగా ఉంది కుమారి. 1997లో ప్రయాణాలకు స్వస్తి పలికి ముంబయిలో స్థిరపడ్డారు ఇద్దరూ. కష్టాలన్నీ తీరిపోయాయి. కావాల్సినంత బ్యాంకు బ్యాలెన్స్. అంతకుమించిన పేరు ప్రఖ్యాతులు. కొడుకును అమెరికాలో చదివించే స్థాయికి చేరుకున్నారు. కూతురును ముంబయిలోనే గొప్ప పాఠశాలకు పంపిస్తున్నారు.

విలాసవంతమైన జీవితం. అన్యోన్య దాంపత్యం. జీవితాన్ని ఇంకా గొప్పగా అనుభవించడం ఎలాగో కలలు కనలేదామె! తన గతాన్ని గుర్తు చేసుకున్నది. చిన్నప్పుడు జరిగిన ఓ సంఘటన ఆమెకు ఏదో ఉపదేశం చేసింది.

ఆ రోజూ ఎప్పటిలాగే బడి నుంచి వచ్చింది కుమారి. కూతురుకు అన్నం వడ్డించి, తనూ భోజనం వడ్డించుకుంది తల్లి. ఇంతలో తలుపు తట్టిన శబ్దం. ఎవరో తెలియదు! 'ఆకలిగా ఉందమ్మా!' అని దీనంగా అడిగారు. కుమారి తల్లి వెంటనే లోపలికి వచ్చి తన పళ్లెంలో ఉన్న అన్నంలో సగాన్ని తీసి అతడికి ఇచ్చేసింది. మిగిలిన సగంతోనే కడుపు నింపుకొంది. 'ఎందుకమ్మా!అలా నీ అన్నం ఇచ్చేశావ్' అని అడిగింది చిన్నారి కుమారి. 'మనకు ఉన్నదాంట్లో ఎంతో

ద్వేషించడం కాక ప్రేమించడం, అనుకరించడం కాక అనుసరించడం, పొగడడం కాక అభినందించడం నేర్చినవాడు వివేకి

కొంత పరులకు సాయంచేయాలి. అది మానవధర్మం' అని చెప్పిందామె! ఆ మాటలు కుమారి పదేపదే గుర్తు చేసుకునేది. వారికంటూ ఉంటే కదా, పరులకు సాయం చేయడానికి. ఆ రోజు వస్తే మాత్రం నలుగురికీ తప్పకుండా తోచిన సాయం చేస్తానని మనసులో బలంగా నిశ్చయించుకుంది.

**నిరుపేద విద్యార్థులకు అండగా..**

సమాజానికి ఏదైనా చేయాలనే సంకల్పంతో ఎన్నో ప్రణాళికలు రూపకల్పన చేసింది కుమారి. భర్తతో 'మనం బాగా స్థిరపడ్డాం కదా! ఏదైనా ఛారిటీ మొదలు పెడదామా?' అన్నది. 'మనం చేసే సాయం తాత్కాలికంగా ఒకపూట ఆకలి తీరిస్తే సరిపోదు. కుటుంబ పరిస్థితే మారిపోవాలి. ఆ తర్వాతి తరాల తలరాతలు కూడా మారిపోవాలి'అన్నాడు శిబూలాల్. దాని నుంచి పుట్టిందే సరోజినీ దామోదర్ ఫౌండేషన్. 1999 శిబూలాల్ తల్లిదండ్రుల పేరిట సేవా సంస్థను ప్రారంభించారు దంపతులిద్దరు. ఫౌండేషన్ వ్యవహారాలన్నీ కుమారే చూసుకునేది. నిరుపేదలైన మెరిట్ విద్యార్థులకు అండగా నిలిచే లక్ష్యంతో ఈ సంస్థను ప్రారంభించారు. మొదటి ఏడాది కేరళలో ఇద్దరు విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందించి వారి ఉన్నత విద్యకు బాటలు వేసింది కుమారి. ఆ మరుసటి ఏడాది ఏడుగురు, ఆపై పదుల సంఖ్యలో, ఇప్పుడు వేలమంది విద్యార్థులకు అండగా నిలుస్తున్నది. లక్ష్మీ కటాక్షం లేని సరస్వతీ పుత్రులను అక్కున చేర్చుకొని వారి భవిష్యత్తుకు భరోసానిస్తున్నది.

**తల్లిగా ఆదుకుంటూ..**

విద్యాధన్ పేరిట పది రాష్ట్రాల్లో సేవలు అందిస్తున్నది సరోజినీ దామోదర్ ఫౌండేషన్. ప్రతి రాష్ట్రం నుంచి వంద మంది ప్రతిభావంతులను ఎంపిక చేసి ఉన్నత చదువులకు బాటలు వేస్తున్నది. కోయంబత్తూర్, బెంగళూరు నగరాల్లో సంహిత అకాడమీ స్థాపించి నిరుపేద విద్యార్థులకు హాస్టల్ వసతితో నాణ్యమైన విద్య అందిస్తున్నది. విద్యా దానమే కాదు, గుండె సంబంధిత వ్యాధులతో సతమతమయ్యే చిన్నారులకు ఉచితంగా ఆపరేషన్లు చేయించడానికి కార్డియక్ కేర్ విభాగాన్ని స్థాపించింది. వృద్ధుల కోసం పెన్షన్ ప్రాజెక్ట్ నిర్వహిస్తున్నది. ఆర్గానిక్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నది. వివిధ పాఠశాల్లో వేలమంది విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నది. దాతల నుంచి విరాళాలు సేకరించడం కాకుండా దాతలకు, గ్రహీతలకు వారధిగా ఉంటూ నిధులు దుర్వినియోగం కాకుండా చూసుకుంటున్నది కుమారి. భర్త సహకారంతో రెండు దశాబ్దాలుగా ఈ బృహత్కార్యాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నది. తల్లి చూపిన దయాగుణాన్ని పాటిస్తూ.. ఎందరినో తల్లిగా ఆదుకుంటున్నది.



**ఇరవై ఏండ్లుగా..**

గడిచిన ఇరవై ఏండ్లలో దాదాపు 17,000 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేసిందీ సంస్థ. ఏదో ఒక్క ఏడాది ఉపకార వేతనం అందజేసి ఊరుకోలేదు కుమారి. పదో తరగతిలో 95 శాతం మార్కులు సాధించిన నిరుపేద విద్యార్థులను ఎంపిక చేసి, స్వయంగా తనే ఇంటర్వ్యూలు చేసి, వారి ఆశయాలు తెలుసుకొని చదువు పూర్తయ్యేవరకు స్కాలర్‌షిప్ మంజూరు చేసేలా ప్రణాళిక రూపొందించింది. వరుసగా ఏడేండ్లు స్కాలర్‌షిప్‌లు ఇస్తూ నిరుపేద విద్యార్థుల కలలను నిజం చేస్తున్నది.


ఈ ఫౌండేషన్ సహకారంతో వందలమంది డాక్టర్లు, ఇంజినీర్లు తయారయ్యారు. సంస్థకు అండగా ఉంటూ తమలాంటి పేద విద్యార్థులకు సహకారం అందిస్తున్నారు. సంస్థ నిర్వహణలో భాగం అవుతున్నారు కూడా!

(నమస్తే తెలంగాణ సౌజన్యంతో)

■

# కాగితపు విత్తనం ... మొలకెత్తే విచిత్రం !

**కా**గితాలు మొలకెత్తుతాయా? ఏంటి వింతగా ఉందే... అవును ఆశ్చర్యమే! నల్లగొండ పట్టణానికి చెందిన ప్రకృతి ప్రేమికురాలు అరుణజ్యోతి చెత్తను సత్తువగా చేసి.. విత్తనాలను మొలకెత్తిస్తున్నారు. మహారాష్ట్రలోని మరాఠా కుటుంబంలో పుట్టిన ఆమె.. వ్యర్థానికి అర్థాన్ని సృష్టించింది. 'సీడ్ పేపర్ జ్యోతక్క' గా మన్ననలు పొందుతోంది.. ఆమె మాటల్లో...



మనం ఇచ్చిన కానుకలు పచ్చగా మొలకెత్తినప్పుడు వచ్చే ఆనందం ఇంకెందులోనూ ఉండదు. జ్యోతక్కా.. చూశారా..మీరిచ్చిన సీడ్ పేపర్లు (కాగితం విత్తనాలు) మొక్కలయ్యాయి అంటూ ఫోటోలు పంపిస్తుంటారు. పారేసే చెత్తతో ఇంత మంచి పని చేస్తుంటే సంతృప్తి అనిపిస్తుంది. సీడ్‌పేపర్ తయారీకి ముందు నేను కొన్ని ప్రయోగాలు చేశాను. అలా వచ్చింది ఈ ఆలోచన. వ్యర్థాల నుంచీ పనికొచ్చే వస్తువుల్ని చేయడం పెళ్లికి ముందు నుంచి అలవాటుంది.

అయితే పర్యావరణాన్ని కాపాడే ప్రయత్నం ఒకటి చేద్దామని ఆలోచించాను. అప్పుడు తయారుచేసిందే సీడ్ పేపర్. మనం రోజూ సొరకాయ, బీరకాయ, గుమ్మడి.. ఇలా ఎన్నో కూరగాయల వ్యర్థాలను చెత్తబుట్టలో పడేస్తుంటాం. గుజ్జుగా చేసిన ఆ చెత్తతోనే టిష్యూ పేపర్‌పై విత్తనాలు చల్లి సీడ్ పేపర్ చేశాను. ఇంట్లో చెత్త పోగయ్యే పరిస్థితే ఉండదు. మున్సిపాలిటీ వాళ్లు కూడా జ్యోతక్క ఇంట్లో చెత్త ఎక్కువగా ఉండదు అంటుంటారు. నాకు వీలున్నప్పుడల్లా సీడ్ పేపర్లను చేస్తుంటాను. వాటిని స్నేహితులకు ఇస్తుంటాను. మట్టి పైపొర తీసి.. ఈ సీడ్‌పేపర్లను పాతిపెట్టి, మట్టి కప్పి, నీళ్లు చల్లితే చాలు.. విత్తనాలు మొలకెత్తుతాయి.

**సీడ్‌పేపర్ ఎలా చేయాలి?**

- ➪ వృథాగా పడేసే కూరగాయల తొక్కలను మిక్సీలో వేసి గుజ్జుగా చేసుకోవాలి..
- ➪ ఓ టిష్యూ పేపర్‌పై ఆ గుజ్జుతో అలికేయాలి.
- ➪ అలికిన కాగితంపై విత్తనాలను నలుమూలలా చల్లాలి.. పైన ఎండిన వేపాకును చల్లాలి..
- ➪ దానిపై మళ్లీ ఒక టిష్యూ పేపర్‌ను పరచాలి..
- ➪ రెండ్రోజులు ఈ కాగితాన్ని ఆరబెట్టాలి..
- ➪ జొన్నరొట్టెలా గట్టిపడిన ఆ కాగితాన్ని.. మట్టి పైపొరను తీసి లోపలపెట్టి.. మళ్లీ మట్టిని వేయాలి.
- ➪ కాస్త నీళ్లు చిలకరిస్తే చాలు. విత్తనాలు మొలకెత్తుతాయి.

కాగితం విత్తనాలను బంధుమిత్రులకు కానుకగా ఇవ్వొచ్చు. లేదంటే అడవుల్లో బీడు భూముల్లో వేయొచ్చు.


– ఆంధ్రజ్యోతి సౌజన్యంతో

■



## వాళ్ళ ఇంటి లోపల ఎవరైనా టాయిలెట్ నిర్మించవచ్చు ప్రభుత్వ సబ్సిడీ మరియు రుణ సహాయంతో

- మరుగుదొడ్డిని నిర్మించుకునేందుకు ప్రభుత్వ సబ్సిడీ పొందండి
- ఎస్‌హెచ్‌జిలు/బ్యాంకులు/నాన్-బ్యాంకింగ్ ఆర్థిక సంస్థల నుంచి సులభంగా రుణాలు పొందండి
- మరింత సమాచారం కోసం, పంచాయతీ అధికారి/ప్రభుత్వ అధికారి/ఎన్‌జిఒను సంప్రదించండి



## పరిశుభ్రమైన గ్రామం, ఆరోగ్యకరమైన గ్రామం, సంతోషకరమైన గ్రామం

- మరుగుదొడ్డి ఉపయోగించడం సౌలభ్యంగా ఉంటుంది
- పిల్లలు మరియు మహిళలకు భయం మరియు సిగ్గుపడవలసిన అవసరం లేదు
- వ్యాధుల వ్యాప్తిని నివారించండి
- పిల్లల చదువు లేదా కుటుంబ ఆదాయం ప్రతికూలంగా ప్రభావితం కావు

- రెండు గుంతల నిర్మించండి
- నీటి కనెక్షన్ ఇన్‌స్టల్ చేయండి
- సులభ లోన్ పొందండి
- మీ కుటుంబాన్ని సంతోషపెట్టండి



नाबार्ड



# స్వచ్ఛత ఉద్యమం

नाबार्ड

### రోజూ మరుగుదొడ్డి ఉపయోగించండి మీ కుటుంబంలో ఆరోగ్యం మరియు సంతోషం నింపండి



అభివృద్ధి కోసం పారిశుధ్యం

నాబార్డు సౌజన్యంతో

చిరు ప్రయత్నం, గొప్ప ప్రగతి

## బహిర్భూమికి వెళ్ళడం అంటే మీ ఇబ్బందులను పెంచుకోవడమే:



జబ్బులు- అతిసారం, నీళ్ళ విరేచనాలు, కరోనా వైరస్ ఇన్ఫెక్షన్.

కాలుష్యం- భూమి కాలుష్యం, నీటి కాలుష్యం






మహిళలకు భయం మరియు సిగ్గు

## ఇంట్లో మరుగుదొడ్డి ఉండగా బహిర్భూమికి ఎందుకు వెళ్ళాలి?

నీటి కనెక్షన్ లేదా?





మరుగుదొడ్డి గుంత నిండిపోయిందా?

మరుగుదొడ్డికి మరమ్మతులు అవసరమా?



## పరిష్కారాలు సులభమమైనవి:



మీ మరుగుదొడ్డి నీటి కనెక్షన్ పొందండి

మా మరుగుదొడ్డి జత గుంతలు నిర్మించుకోండి





అవసరమైతే మీ మరుగుదొడ్డి రెండు గుంతల మరుగుదొడ్డి నిర్మించండి

నీటి సదుపాయం కల్పించండి



MAHILA SADHIKARATHA
Publication Date: 01-12-2020; Posting Date: 05-12-2020

RNI Regd No: TELTEL / 2003 /16365
Postal Regd No: HD/1064/2018-20





నెల్లూరు జిల్లా అల్లూరులో ... చిత్తూరు జిల్లా తంబళ్లపల్లి లో ...

## సి ఎస్ రెడ్డి క్షేత్రస్థాయి కార్యక్రమాల పరిశీలక పర్యటన ... మరికొన్ని దృశ్యాలు !

భూమాత,అనంత ఎఫ్ పి ఓల సమావేశం ... మిడుతూరులో ... పెద్ద మండ్యంలో ...







కనిగిరిలో నీరు,పారిశుధ్యం,ఆరోగ్య స్థితిపై ఏపిమాస్ ప్రతినిధి అధ్యయనం



గుడిబండ మండలంలో నీరు, పారిశుధ్యం, ఆరోగ్య స్థితిపై ఎస్ హెచ్ జి లకు అవగాహన



ఎఫ్ పి ఓల డైరెక్టర్లకు రాయచోటిలో ఏపిమాస్ చే ఒకరోజు శిక్షణ





తిమ్మాజివాడిలో ... కల్వరాలలో ... గుంతకల్లులో ...

## వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ కేంద్రాల ప్రారంభోత్సవ సంరంభం

పామిడిలో .... నల్లమాడలో ... ' రెడ్స్ ' సంస్థచే కురుగుంట గ్రామంలో ....





బట్వాడా కాకపోతే దయచేసి
ఈ చిరునామాకు తిప్పిపంపండి

ఎడిటర్, ఏపిమాస్ కార్యాలయం, ప్లాట్ నెం.11-12, హుడా కాలని, తానీషా నగర్,
డ్రీమ్ వ్యాలీ దగ్గర, మణికొండ, రంగారెడ్డి జిల్లా, హైదరాబాదు-500089